ఈనాటి
PRGI-NO-APTEL/25/A2739
# తెలుగోడు
EENAATI TELUGODU... Telugu Daily
https://www.eenaatitelugodu.com
సంపుటి-1 | సంచిక - 133 | బుధవారం 11 ఫిబ్రవరి 2026 | పేజీలు - 8 | వెల - రూ.. 5
Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati





### తిరుమల లడ్డూ కల్తీ నెయ్యిపై
## రంగంలోకి ఈడీ



**న్యూ ఢిల్లీ (తెలుగోడు),ఫిబ్రవరి 10 :**
శ్రీవారి లడ్డూ కల్తీ నెయ్యి వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగింది. ఈ కేసులో భారీ ఆర్థిక అక్రమాలు, మనీ లాండరింగ్ జరిగినట్లు సిట్ విచారణలో తేలడంతో పీఎంఎల్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఈ వ్యవహారంలో వందలాది కోట్లు చేతులు మారడంపై ఈడీ విచారణ జరపనుంది. అలాగే, మనీ (మిగతా 2లో)

### కెనెడాపై విరుచుకుపడ్డ
## డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్ (తెలుగోడు),ఫిబ్రవరి 10 :**
కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని.. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ను అమెరికాలోని మిచిగాన్‌తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెన ను బ్లాక్ చేస్తామని బెదిరించారు. 2014 లో అప్పటి (మిగతా 2లో)



# అమాత్యా..!
# సహకరించండి

- స్టాఫ్ వర్క్ ఆర్డర్ శాశ్వతంగా ఎత్తేయండి..
- సాగునీటి ప్రాజెక్టులు, అంతర్ రాష్ట్ర వివాదాలపై చర్చ..
- రాష్ట్ర అభివృద్ధిపై కేంద్ర మంత్రులతో చంద్రబాబు భేటీ..

**న్యూ ఢిల్లీ (తెలుగోడు),ఫిబ్రవరి 10 :**
ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం సమావేశమయ్యారు. ఏపీలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థిక సాయం, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్, తాగునీటి భద్రతకు ఇవి ఎంతో ముఖ్యమని సీఎం వివరించారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా ముఖ్యమంత్రి సవివరంగా చర్చించారు. సీఎం చంద్రబాబు ఈ భేటీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్య అంశాలను ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాఫ్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా ఎత్తివేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని (మిగతా 2లో)

### వ్యవసాయ రంగానికి ఊతం ఇవ్వండి

ఢిల్లీ పర్యటనలో ఉన్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శివరాజ్ సింగ్ చౌహాన్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయం సహా అనుబంధ రంగాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై కేంద్ర మంత్రితో సీఎం చర్చించారు. కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్‌ను విస్తరించడానికి నిధులు విడుదల చేయాలని కోరారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించడం వల్ల అందించే ప్రోత్సాహకాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.216 కోట్లు ఇవ్వాలని కోరారు. 2024-25లో (మిగతా 2లో)

### అమరావతికి చట్టబద్ధతపై అమిత్‌షాతో చర్చ

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తో ఏపీ సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. రాజధాని అమరావతికి చట్టబద్ధత వ్యవహారంపై ఆయనతో చర్చించినట్లు సమాచారం. ఇప్పటికే పార్లమెంట్‌లో బిల్లు పెట్టాబడ్జెబడెట్ రెండో దశ సమావేశాల్లో బిల్లు పెట్టాలని అమిత్‌షాను సీఎం కోరినట్లు సమాచారం. దీంతో పాటు రాష్ట్రానికి చెందిన మరికొన్ని అంశాలపైనా కేంద్ర హోంమంత్రితో సీఎం చంద్రబాబు చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోనూ రాష్ట్రానికి రావాల్సిన నిధులపై సుదీర్ఘంగా చంద్రబాబు చర్చించారు.

### తిరుపతి మీదుగా వెళ్లేలా ప్లాన్ చేయండి

బెంగళూరు-చెన్నై హై స్పీడ్ రైల్ కారిడార్‌ను తిరుపతికి కనెక్ట్ చేసేలా చూడాలని కేంద్ర రైల్వే శాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా అశ్వినీ వైష్ణవ్‌తో చంద్రబాబు భేటీ అయ్యారు. ఏపీని టచ్ చేస్తూ వెళ్లే మూడు హై స్పీడ్ రైల్ కారిడార్లను ప్రకటించడంపై కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ రైల్వే ప్రాజెక్టుల పూర్తి, కొత్త రైలు మార్గాలు, సర్వీసులు ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ కార్యకలాపాలు ఏప్రిల్ 1 (మిగతా 2లో)

### కేవలం ప్రచార హడావిడి ....రాష్ట్రంలో
# కూటమి ఫెయిల్

- తప్పుడు జీఎస్‌డీపీ లెక్కలతో ప్రజలను మభ్యపెడుతున్న సిఎం
- పన్నుల వృద్ధిలో రాష్ట్రానికి దేశంలో 22వ స్థానం..
- రెండేళ్లలో పన్ను ఆదాయాల పెరుగుదల 1.97శాతమే..
- అసత్య ప్రచారాలతో ఉనికి కాపాడుకునే యత్నం..
- అప్పులు, అవినీతి, రాజకీయ కక్షలలో మొదటి స్థానం..
- మాజీ సిఎం వైయస్ జగన్..



**తాడేపల్లి (తెలుగోడు),ఫిబ్రవరి 10 :**
చంద్రబాబు ప్రభుత్వంలో పబ్లిసిటీ ఎక్కువ, పనితీరు తక్కువగా ఉందని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, పన్నుల రాబడిపై చంద్రబాబు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఎక్స్ వేదికగా ఎండగట్టారు. ప్రభుత్వ లెక్కలే రాష్ట్ర ఆర్థిక మందగమనాన్ని (మిగతా 2లో)

### తిరుమల లడ్డూ పై వ్యాఖ్యలు
# దైవ ద్రోహమే

- రాజమండ్రి జైలులో అంబటితో ములాఖత్..
- నెయ్యికల్తీపై సిట్ నివేదికను విస్మరించిన సిఎం..
- జంతువుల కొవ్వు వ్యాఖ్యలపై తీవ్ర ఆక్షేపణ..
- శ్రీవారి ప్రసాదంపై సిఎం తప్పుడు వ్యాఖ్యలు చేయొచ్చా..
- ఇప్పటికైనా చంద్రబాబు పునరాలోచించాలి.. ఉండవల్లి.



**రాజమండ్రి (తెలుగోడు),ఫిబ్రవరి 10 :**
తీవ్ర చర్చనీయాంశంగా మారిన తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వివాదంపై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అరెస్టై రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న వైసీపీ నేత అంబటి రాంబాబును ఉండవల్లి మంగళవారం 2లో


# అమెరికా వాణిజ్య ఒప్పందం భారత్‌కు దెబ్బ

- మన వ్యవసాయాన్ని ముంచేయడం ఖాయం...
- వస్త్ర పరిశ్రమకు కూడా కోలుకోలేని నష్టం..
- ఎక్స్ వేదికగా మల్లికార్జున ఖర్గే విమర్శలు..

**న్యూ ఢిల్లీ (తెలుగోడు),ఫిబ్రవరి 10 :**
భారత్ అమెరికాతో మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడంపై కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ఈ ఒప్పందం భారతదేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, రైతులు, పశువులు, వస్త్ర రంగాన్ని బలహీనపరుస్తుందని ఆయన ఆరోపించారు. ఈ ఒప్పందాన్ని ఆయన ప్రజా సంబంధాల ద్రోహంగా అభివర్ణించారు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 9న విడుదలైన వైట్‌హౌస్ ఫ్యాక్ట్ షీట్ ఫిబ్రవరి 6న భారత్- అమెరికా సంయుక్త ప్రకటనలో చేర్చని షరతులను వెల్లడించిందని ఖర్గే ఎత్తిచూపారు. రష్యా చమురు నిలిపివేయడానికి భారత్ నిబద్ధతను ప్రదర్శించడం వల్లే అదనంగా 25 శాతం సుంకాల్ని తొలగించినట్లు అమెరికా ప్రకటన పేర్కొంది. ఇది భారతదేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడమేనని ఖర్గే తీవ్రంగా విమర్శించారు. ÷ారత్ అమెరికా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కేంద్రాన్ని (మిగతా 2లో)



### ఓం బిర్లా అవిశ్వాస తీర్మానంపై
## చర్చకు ఒకరోజు



**న్యూ ఢిల్లీ (తెలుగోడు),ఫిబ్రవరి 10 :**
లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి ప్రతిపక్షం సిద్ధమైంది. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ప్రసంగానికి అనుమతించనందుకు, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబేపై చర్యలు తీసుకోనందుకు నిరసనగా స్పీకర్‌పై ఓం బిర్లాపై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి సిద్ధమైంది. మరి ఈ అవిశ్వాస తీర్మానానికి సంబంధించి నియమనిబంధనలు ఇలావున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 94(సీ) కింద లోక్‌సభ స్పీకర్ లేదా డిప్యూటీ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టొచ్చు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదిస్తే స్పీకర్, లేదా డిప్యూటీ స్పీకర్ తమ పదవిని కోల్పోతారు. ఈ తీర్మానానికి సంబంధించి కనీసం 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. లోక్‌సభ కార్యకలాపాల నిబంధనల ప్రకారం, లోక్‌సభ ఎంపీ ఎవరైనా ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టొచ్చు. ఇందుకోసం లిఖిత పూర్వకంగా లోక్‌సభ సెక్రెటరీ జనరల్‌కు ముందస్తు నోటీసు ఇవ్వాలి. ఆ తరువాత సభలో నిర్వహించాల్సిన కార్యకలాపాల జాబితాలో ఈ తీర్మానాన్ని చేరుస్తారు. దీనిపై చర్చకు ఒక తేదీని కేటాయిస్తారు. ప్రస్తుతం ఈ తేదీని డిప్యూటీ స్పీకర్ నిర్ణయించనున్నారు. ఇక నిర్ణీత తేదీన లోక్‌సభలో ఈ తీర్మానాన్ని ప్రవేశపెడతారు. ఆ సమయంలో సభలో ఉన్న కనీసం 50 మంది ఎంపీలు తీర్మానికి మద్దతు తెలిపితేనే ఓటింగ్‌కు మార్గం సుగమం అవుతుంది. లేకపోతే ఆదిలోనే ఇది వీగిపోతుంది. తీర్మానాన్ని సభ ఓటింగ్‌కు స్వీకరించాక (మిగతా 2లో)

# అనాధలకు పవన్ ఆసరా

### వారి బాధ్యతలను తీసుకుంటున్నట్లు ప్రకటన



**అమరావతి (తెలుగోడు),ఫిబ్రవరి 10 :**
ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్.. మరో ఇద్దరు అనాథ చిన్నారులకు ఆసరగా నిలిచారు.. పిఠాపురం నియోజకవర్గం ప్రజలందరినీ తన సొంత కుటుంబ సభ్యులుగా చూసుకుంటున్న పవన్ కల్యాణ్.. ఎవరికి ఎలాంటి ఇబ్బంది వచ్చినా.. అది చిన్నదయినా.. పెద్దదయినా.. తక్షణం స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గవ్యాప్తంగా 42 మంది అనాథ చిన్నారులకు తన జీతం మొత్తాన్ని ఆర్థిక సాయం రూపంలో అందిస్తున్న ఆయన.. తాజాగా మరో ఇద్దరు చిన్నారుల బాధ్యతను స్వీకరించారు. పిఠాపురం మండలం మాధవపురం గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు రెండేళ్ల క్రితం తండ్రిని, ఇటీవల తల్లిని కోల్పోయారు. ఓ వీడియో సందేశం పంపారు. (మిగతా 2లో)

# విద్యార్థులకు భారీ ఊరట

### రూ 1200 కోట్లు ఫీజు రీఎంబర్స్‌మెంట్ నిధులు విడుదల



**అమరావతి (తెలుగోడు),ఫిబ్రవరి 10 :**
విద్యార్థులకు కూటమి ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల్లో భాగంగా రూ.1200 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం ఇవాళ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాం నుంచీ కొనసాగుతున్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకపోవడంతో దాదాపు రూ.7 వేల కోట్లకు పైగా పేరుకుపోయాయి. ఈ నేపథ్యంలో తొలి విడతగా రూ.1200 కోట్లను విడుదల చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ఈ నిధుల విడుదలతో ఇప్పటివరకు ఫీజు బకాయిల కారణంగా కాలేజీలు నిలిపివేసిన పరీక్షల (మిగతా 2లో)

# బడ్జెట్ సమావేశాలు

### అధికారులతో స్పీకర్ అయ్యన్న సమీక్ష... 14 బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న ఆర్థికమంత్రి

**అమరావతి (తెలుగోడు),ఫిబ్రవరి 10 :**
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11న బుధవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయి. ఉదయం 10: 30కి ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ నజీర్ ప్రసంగించనున్నారు. సుమారు గంటసేపు స్పీచ్ ఉండే అవకాశం ఉంది. తరవాత 11: 30 గంటలకి బీఏసీ సమావేశం జరగనుంది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణకు సంబంధించి ప్రధానంగా చర్చిస్తారు. 20 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం ఉంది. ఇక, ఈ నెల 14వ తేదీన 2026-27కి సంబంధించిన బ్జడెట్ ను ఆర్థిక మంత్రిపయ్యావుల కేశవ్ ప్రవేశ పెట్టనున్నారు. ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్న పాత్రుడు వరుస సమావేశాలు నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు నిర్వహించే ఆటలు, సంస్కృతిక కార్యక్రమాలపై స్పీకర్ అయ్యన్న సమీక్ష చేశారు. సీఎస్ విజయానంద్, (మిగతా 2లో)



# అసెంబ్లీకి వైఎస్ జగన్

### తొలిరోజు వచ్చిపోయే అవకాశం.... అసెంబ్లీ వ్యూహంపై పార్టీ నేతలతో చర్చ

**అమరావతి (తెలుగోడు),ఫిబ్రవరి 10 :**
అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలకు మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హాజరుకానున్నారు. సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగం జరిగే సమయంలో జగన్‌తో పాటు వైసీపీ ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యే సమయంలో అనుసరించాల్సిన వ్యూహంపై ఇప్పటికే పార్టీ కీలక నేతలు కసరత్తు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, ఇటీవల వైసీపీ నేతలపై జరుగుతున్న దాడులు, తిరుమల లడ్డూ వ్యవహారంలో ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా సభలో నిరసన తెలపాలా అనే అంశాలపై చర్చ జరుగుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం వైఎస్ జగన్ అధ్యక్షతన వైసీపీ శాసనసభా పక్ష సమావేశం జరగనుంది. ఈ సమావేశం అనంతరం అసెంబ్లీలో (మిగతా 2లో)



# అమాత్యా..! సహకరించండి



(మొదటి పేజీ (తరువాయి)

కోరారు. ఈ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు వల్ల పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలన్నారు. అలాగే ఫేజ్-ఎవి పనులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫేజ్-ఎవిలో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉందని, దీనికి అదనంగా సుమారు రూ.32,000 కోట్ల నిధులు అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు.గోదావరి వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో ప్రతిపాదిత పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపైనా చర్చ జరిగింది. తాగు, సాగునీరు, పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టుగా చెప్పుకొచ్చారు సీఎం. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా దీనికి అనుమతులు మంజూరు చేసి సాంకేతిక, ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాద పరిష్కారించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (విడబ్ల్యుడీటీ) తుది నివేదికను వెంటనే గెజిట్‌లో ప్రచురించాలని, దీని ఆధారంగా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తిచేశారు. గోదావరి జలాల పంపకంపై ఆంధ్రప్రదేశ్,తెలంగాణ మధ్య కొనసాగుతున్న వివాదంపై కూడా చర్చించారు. ఈ వివాద పరిష్కారం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు సీఎం. ఎగువ కృష్ణాపై కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు చేపట్టిన చర్యలపై సీఎం తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ ఎంపీలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# వ్యవసాయ రంగానికి ఊతం ఇవ్వండి

(మొదటి పేజీ (తరువాయి)

సాగులో రసాయనాల వినియోగం 2.28 శాతం మేర తగ్గించామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్నాము.. ఇప్పటి వరకు 18 లక్షల మంది రైతులు 8 లక్షల హెక్టార్లలో సేంద్రియ సాగుకు మొగ్గు చూపుతూ సమ్మతి తెలిపారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి సాగు అభివృద్ధి చేయడానికి రూ.200 కోట్ల మేర సాయం చేయాలని కోరారు. కోకోనట్ ప్రాసెసింగ్ పార్క్ ఏర్పాటు, కర్ణాటక తరహాలో టెండర్ కోకోనట్ మార్కెట్ల ఏర్పాటు, కొబ్బరి రైతులకు అధునాతన పద్ధతులపై శిక్షణ, నర్సరీల విస్తరణకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏపీలో మఖానా డెవలప్‌మెంట్ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కొల్లేరు సరస్సు ప్రాంతంలో 50వేల ఎకరాల్లో మఖానా సాగుకు అనుకూల వాతావరణం ఉందని, అవసరమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దేశ వ్యవసాయ రంగంలో ఏపీ వాటా 10 శాతం ఉందని గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఏపీ హార్టికల్చర్ హబ్‌గా మారుతోందని ఈ సందర్భంగా కేంద్రమంత్రి అన్నారు. రాష్ట్రంలో జీడిపప్పు, కాఫీ, కోకో, కొబ్బరి ఎక్కువగా పండుతోందని, రైతులకు మద్దతు ధర దక్కేలా చూస్తామన్నారు. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఏపీ పాత్ర కీలకమన్నారు. ఏపీ వ్యవసాయాభివృద్ధికి కేంద్రం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఇందు కోసం కేంద్రం ప్రత్యేక బృందాన్ని నియమించిందని చెప్పారు. కేంద్ర పథకాలు, సాంకేతికత విషయంలో ఏపీకి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. మత్స్యరంగం, పశుపోషణ అభివృద్ధికి సాయం చేస్తున్నట్టు చెప్పారు. సేంద్రియ సాగు, పామాయిల్ ఉత్పత్తిలో ఏపీ బాగా పనిచేస్తోందన్నారు. సేంద్రియ సాగు విస్తరణకు అన్ని విధాలుగా సాయం చేస్తామని తెలిపారు.

### తిరుపతి మీదుగా వెళ్లేలా ప్లాన్ చేయండి

(మొదటి పేజీ (తరువాయి)

నుంచి ప్రారంభమయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీఎం కోరారు. తాడిపత్రి నుంచి ముంబయి జేఎన్‌పీటీ పోర్టుకు అరటి ఎగుమతులకు వీలుగా 50 శాతం రాయితీపై ఖాళీ రీఫర్ కంటైనర్ల కేటాయించాలన్నారు. విజయవాడ, విశాఖ, తిరుపతి, అమరావతిలో గ్రీన్ ఫీల్డ్ మెగా కోచింగ్ టెర్మినళ్లు ఏర్పాటు చేయాలని సీఎం కోరారు. ఉత్తర- దక్షిణ భారత్‌లను కలిపేలా ఇటార్సీ- విజయవాడ మధ్య ప్రత్యేక సరకు రవాణా కారిడార్ ఏర్పాటుకు సహకారం అందించాలన్నారు. ఏపీలోని పోర్టులను అనుసంధానిస్తూ విజయవాడ మీదుగా ఖరగ్ పూర్- చెన్నై మధ్య ఈస్ట్ కోస్ట్ కారిడార్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ సహా ఆదివాసీ ప్రాంతాలను కనెక్టు చేసేలా వివిధ కొత్త రైల్వేమార్గాల ప్రతిపాదనల్ని ఆమోదించాలని కోరారు. విశాఖ-విజయవాడ మధ్య హైస్పీడ్, విజయవాడ-కర్నూలు మధ్య సెమీ హైస్పీడ్, తిరుపతి-చిత్తూరు మధ్య హైస్పీడ్ లింక్ కారిడార్ మంజూరు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. హైదరాబాద్- శ్రీశైలం- మార్కాపురం కొత్త రైల్వే లైన్ ద్వారా శ్రీశైలం పుణ్యక్షేత్రానికి కనెక్టివిటీని పెంచాలని, తిరుపతి మీదుగా విజయవాడ-బెంగుళూరు మధ్య వందేభారత్ సర్వీసును నడపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. వివిధ ఎక్స్ ప్రెస్ రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇవ్వటంతో పాటు రైలు బోగీ నిర్వహణ టెర్మినల్ ఏర్పాటు చేయాలని రైల్వే మంత్రికి విజ్ఞప్తి చేశారు.

# అనాధలకు పవన్ ఆసరా

(మొదటి పేజీ (తరువాయి)

ఆ చిన్నారుల వేదన పవన్ కల్యాణ్‌ని కదిలించింది. ఆ చిన్నారులకు ప్రతి నెలా రూ. 5 వేల చొప్పున.. ఇద్దరికీ రూ. 10 వేలు అందించాలని తన కార్యాలయ అధికారులని ఆదేశించారు. ఏ ఆధారం లేని చిన్నారులకు తక్షణం ఇల్లు కట్టించి ఇచ్చే ఏర్పాటు చేయాలని సూచించారు. ఇద్దరు చిన్నారులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్, కాలేజీల్లో చేర్పించే ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆ బాధ్యతను కాకినాడ జిల్లా కలెక్టర్ కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. అప్పగించారు.

# విద్యార్థులకు భారీ ఊరట


హాల్ టికెట్లు, పరీక్షలు పూర్తయిన తర్వాత ఇవ్వాల్సిన సర్టిఫికెట్లను ఇకపై ఆపకుండా విద్యార్థులకు అందజేసే అవకాశం కలిగింది. ముఖ్యంగా పోస్ట్ మెట్రిక్ కోర్సులు చదువుతున్న లక్షలాది మంది విద్యార్థులకు ఇది పెద్ద ఊరటగా మారింది. ప్రభుత్వ ఉత్తర్వులపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలో ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు పోస్ట్-మెట్రిక్ కోర్సుల్లో పూర్తి ట్యూషన్ ఫీజును ప్రభుత్వం రీయింబర్స్ మెంట్ రూపంలో ఆయా కాలేజీలకు చెల్లిస్తోంది. ఇందుకోసం జ్ఞానభూమి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పథకం ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపులు, మైనార్టీలకు వర్తిస్తుంది. ట్యూషన్ ఫీజుతో పాటు స్పెషల్ ఫీజు, ఇతర ఫీజులు, పరీక్ష ఫీజులను నేరుగా కాలేజీల ఖాతాలకు జమ చేస్తున్నారు.

అలాగే మెయింటెనెన్స్ ఫీ కింద ఆహారం, హాస్టల్ ఖర్చుల కోసం ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ మరియు అంతకుమించిన విద్యార్థులకు రూ.20 వేలను తల్లుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తున్నారు. తాజా నిధుల విడుదలతో విద్యార్థుల భవిష్యత్తుపై ఉన్న అనిశ్చితి కొంతమేర తొలగినట్టయిందని విద్యారంగ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# శివాలయాల్లో పెరుగుతున్న రద్దీ

**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**

శ్రీశైలం సహా వివిధ శివాలయాల్లో శివరాత్రి భక్తుల రద్దీ, వసతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్ష నిర్వహించారు. శివారాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీశైలం మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ, సౌకర్యాలపై మంత్రులు, ప్రధాన కార్యదర్శి, డీజీపీలతో పాటు ఇతర అధికారులతో ఢిల్లీ నుంచి సీఎం సమీక్షించారు. శివరాత్రి నాటికి ఆలయంలో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశమున్న నేపథ్యంలో పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీచేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, హోం మంత్రి అనిత.. ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు, వసతులపై అధికారులతో పర్యవేక్షించాలని సీఎం సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అలాగే, దూరప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు త్వరితగతిన దర్శనం పూర్తయ్యేలా.. సరైన వసతి లభించేలా కార్యాచరణ అమలు చేయాలని ఆదేశించారు. దీక్షలు, మాలధారణలతో ఎంతో కష్టపడి ఆలయానికి చేరుకునే భక్తులకు ఇబ్బంది కలిగేలా, అగౌరవ పరిచేలా ఎవరూ వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. రోజు రోజుకూ దేవాలయాల్లో పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు సూచించారు. శివరాత్రి పర్వదినం వంటి సందర్భాల్లో అన్ని విభాగాలు పూర్తి సమన్వయంతో పనిచేసేలా ఇప్పటి నుంచే పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు.



# తిరుమల లడ్డూపై వ్యాఖ్యలు దైవ ద్రోహమే

(మొదటి పేజీ (తరువాయి)

ములాఖత్‌లో కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, లడ్డూ నెయ్యి వివాదంతో పాటు సీఎం చంద్రబాబు వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు గుప్పించారు.అంబటి రాంబాబు 1989లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచే తనకు వ్యక్తిగత పరిచయం ఉందని, ఆ కారణంగానే ములాఖత్‌కు వచ్చానని ఉండవల్లి తెలిపారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త ఒరవడిపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తిట్టిన వారిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపించడం, కొట్టిన వారిని స్టేషన్ బెయిలుతో బయటకు పంపడం వంటి సంప్రదాయం మొదలైందని విమర్శించారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు.తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ అంశంపై జరుగుతున్న రచ్చ పూర్తిగా రాజకీయ దురుద్దేశంతో సాగుతోందని ఉండవల్లి ఆరోపించారు. సిట్ నివేదికలోనే, ముఖ్యంగా 20వ పేజీలో, నెయ్యిలో కొవ్వు పదార్థాల శాతం చాలా తక్కువగా ఉందని స్పష్టంగా పేర్కొన్నారని గుర్తుచేశారు. అలాంటి నివేదిక ఉన్నప్పటికీ సీఎం చంద్రబాబు పదేపదే జంతువుల కొవ్వు అని మాట్లాడటం సరికాదన్నారు.టాయిలెట్లు కడిగే లిక్విడ్ అంటూ కూడా వ్యాఖ్యలు చేయడం అత్యంత దురదృష్టకరమని మండిపడ్డారు. తిరుపతి లాంటి పవిత్ర క్షేత్రానికి సంబంధించిన ప్రసాదంపై సీఎం స్థాయి వ్యక్తి ఈ విధంగా మాట్లాడటం దైవ ద్రోహమేనని వ్యాఖ్యానించారు. చంద్రబాబు సాధారణంగా బ్యాలెన్స్ తప్పి మాట్లాడరని, కానీ తిరుమల లడ్డూ విషయంలో ఎందుకు ఇలా మాట్లాడుతున్నారో అర్థం కావడం లేదన్నారు.ఈ అంశంలో బీజేపీ నేతలు కూడా చంద్రబాబు లాగా మాట్లాడటం లేదని ఉండవల్లి పేర్కొన్నారు. పవిత్రమైన తిరుపతి ప్రసాదాన్ని రాజకీయాలకు వాడుకోవడం సరైంది కాదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు తన వ్యాఖ్యలపై పునరాలోచించాలని, ప్రజల మనోభావాలను గౌరవించాలని ఉండవల్లి అరుణ్ కుమార్ కోరారు..

# రాష్ట్రంలో కూటమి ఫెయిల్

(మొదటి పేజీ (తరువాయి)

ఎదుర్కొంటోందని వైఎస్ జగన్ పేర్కొన్నారు. అయినప్పటికీ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నట్లు చంద్రబాబు ప్రభుత్వం ప్రచారం చేస్తోందని విమర్శించారు. 2024--25లో రాష్ట్ర ఆర్థిక వృద్ధి 11.75 శాతమని, జాతీయ వృద్ధిరేటు 9.8 శాతమేనని చంద్రబాబు ప్రకటించారని గుర్తు చేశారు. అలాగే 2025--26లో రాష్ట్ర వృద్ధి 10.75 శాతంగా ఉంటుందని, జాతీయ వృద్ధి 8 శాతమేనని చెబుతూ, రెండు సంవత్సరాల సగటు వృద్ధిరేటు 11.09 శాతమని ప్రభుత్వం చూపిస్తోందన్నారు.ఈ లెక్కల ఆధారంగా రాష్ట్రం దేశంలో మూడో స్థానంలో ఉందని చెప్పడం పూర్తిగా అసత్యమని వైఎస్ జగన్ స్పష్టం చేశారు. ఇవేవీ స్వతంత్ర సంస్థలు విడుదల చేసిన గణాంకాలు కాదని, చంద్రబాబు కార్యాలయంలోనే తయారైన అంకెలని ఆరోపించారు. వాస్తవంగా ఈ గణాంకాలు నిజమైతే, ప్రభుత్వ ఆదాయాల్లో కూడా అదే స్థాయి వృద్ధి కనిపించాల్సి ఉందని తెలిపారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి తొమ్మిది నెలల కాగ్ నివేదికలు పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉందని వైఎస్ జగన్ వెల్లడించారు. రెండేళ్ల కాలంలో ప్రభుత్వ పన్ను ఆదాయాల వృద్ధి కేవలం 1.97 శాతం మాత్రమేనని తెలిపారు. 11.09 శాతం వంటి భారీ జీఎస్‌డీపీ వృద్ధి ఉందని చెప్పుకునే రాష్ట్రంలో పన్ను ఆదాయాలు ఇంత తక్కువగా పెరగడం ప్రపంచంలోని ఆర్థిక నిపుణులకే ఆశ్చర్యంగా ఉందన్నారు.23 రాష్ట్రాల్లో పన్ను ఆదాయాల వృద్ధి విషయంలో ఏపీ 22వ స్థానంలో ఉందని, అంటే చివర నుంచి రెండో స్థానంలో నిలిచిందని విమర్శించారు. అదే సమయంలో కేంద్ర ప్రభుత్వ స్థూల పన్ను ఆదాయాలు 9.64 శాతం పెరిగితే, ఏపీ పన్ను ఆదాయాలు మాత్రం 1.97 శాతం మాత్రమే పెరిగాయని గుర్తు చేశారు. అయినప్పటికీ ఏపీ పనితీరు కేంద్ర ప్రభుత్వానికంటే మెరుగైనదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.చంద్రబాబు ప్రభుత్వంలో ఏపీ ఏదైనా విషయాల్లో మొదటి స్థానం సాధించిందంటే అది ప్రభుత్వ అప్పులు, అవినీతి, రాజకీయ కక్షసాధింపు చర్యలు, తప్పుడు ప్రచారాల్లోనేనని వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీవ్రంగా దుయ్యబట్టారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఉత్తమ ర్యాంకులు



**అమరావతి (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**

ఈసారి జాతీయ స్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఆంధ్రప్రదేశ్ అత్యధిక ర్యాంకులు సాధించాలన్న లక్ష్యంతో మునిసిపల్ అధికారులు సమిష్టిగా పనిచేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పిలుపునిచ్చారు. అమరావతిలోని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యాలయం నుంచి మంగళవారం విశాఖపట్నం, రాజమహేంద్రవరం రీజియన్లకు చెందిన మునిసిపల్ కమిషనర్లు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన ఆయన, స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అనేది పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణలో ఉత్తమ పనితీరు కనబరిచే నగరాలు, పట్టణాలను జాతీయ స్థాయిలో గుర్తించే కీలక ప్రక్రియ అని పేర్కొన్న పట్టాభిరామ్, గత సర్వేక్షణ్‌లో గుర్తించిన లోపాలను ఈసారి పూర్తిగా సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు.మునిసిపాలిటీలలో పనిచేసే పారిశుద్ధ్య సిబ్బందికి ముందుగా పూర్తి అవగాహన కల్పించాలని, పాఠశాలలు, పర్యాటక ప్రాంతాలు వంటి కీలక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. గత స్వచ్ఛ సర్వేక్షణ్‌లో పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణలో తీవ్ర లోపాలు కారణంగా నెగెటివ్ మార్కులు వచ్చాయని గుర్తు చేసిన ఆయన, ఈసారి పబ్లిక్ టాయిలెట్స్ నిర్వహణపై అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం మహిళలకు అవసరమైన శానిటరీ న్యాప్‌కిన్స్, డిస్పెన్సర్లు అన్ని పబ్లిక్ టాయిలెట్స్‌లో తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.రాష్ట్రంలోని మొత్తం 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణలో ఇప్పటికే మెరుగైన పనితీరు కనబరుస్తున్న 46 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను గుర్తించి ఈసారి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకులు సాధించేలా ప్రత్యేకంగా ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ స్కీమ్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతపురం రీజియన్‌లో 14, గుంటూరు రీజియన్‌లో 11, రాజమహేంద్రవరం రీజియన్‌లో 16, విశాఖ రీజియన్‌లో 5 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు ఈ జాబితాలో ఉన్నాయని వివరించారు. మిగిలిన మున్సిపాలిటీల్లో కూడా పనితీరు మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.కాంపోస్టింగ్ యూనిట్లు, త్రిబుల్ ఆర్ (రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్) కేంద్రాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, వాటికి సంబంధించిన పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఫ్రెష్ వేస్ట్ ప్రాసెసింగ్ సెంటర్లకు స్థల సేకరణ వేగవంతం చేయాలని, ఇది అత్యంత కీలక అంశమని పేర్కొన్నారు. స్థల సేకరణ పూర్తయితే వెంటనే పనులు ప్రారంభించవచ్చని, అవసరమైన నిధులు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఐఈసీ కార్యక్రమాల ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని సూచించారు. గతంలో స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నెగెటివ్ మార్కులు వచ్చిన మున్సిపాలిటీలు ఈసారి తప్పనిసరిగా లోపాలను సరిదిద్దుకోవాలని, మున్సిపాలిటీలు అప్‌లోడ్ చేసే డేటా, వాస్తవ పరిస్థితుల మధ్య వ్యత్యాసం ఉంటే పెనాల్టీ పాయింట్లు పడతాయని హెచ్చరించారు. డేటా అప్‌లోడ్‌కు అవసరమైన పూర్తి సహకారం స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ అందిస్తుందని తెలిపారు.ఈసారి కోస్టల్ సిటీలకు ప్రత్యేకంగా ర్యాంకింగ్ విధానం అమలు చేస్తున్నట్లు వెల్లడించిన పట్టాభిరామ్, కాకినాడ, మచిలీపట్నం వంటి తీరప్రాంత పట్టణాలు బీచ్‌ల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. బీచ్‌ల వద్ద పబ్లిక్ టాయిలెట్స్, డస్ట్‌బిన్ల ఏర్పాటు తప్పనిసరిగా చేయాలన్నారు. పట్టణాలలో జీరో వేస్ట్ కాలనీల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని, కాలనీ అసోసియేషన్లతో సమావేశాలు నిర్వహించి వెట్ వేస్ట్, డ్రై వేస్ట్ ప్రాసెసింగ్‌పై ప్రజలకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రారంభించిన స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర ఉద్యమం ఫలితంగా గత సంవత్సరం జాతీయ స్థాయిలో ఐదు అవార్డులు సాధించామని, ఈసారి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అత్యున్నత ర్యాంకులు సాధించాలన్న ఆకాంక్షను పట్టాభిరామ్ వ్యక్తం చేశారు.

# వ్యభిచారం, మాన అక్రమ రవాణా

**హైదరాబాద్ (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**

**అమెరికాలో పట్టుబడ్డ ఎనిమిది మంది**
**అందులో వరంగల్‌కు చెందిన సుహృత్ రెడ్డి**

అమెరికాలో జార్జియా రాష్ట్రంలో మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిలో తెలుగు వ్యక్తి చాడ సుహృత్ రెడ్డి కూడా ఉండటం గమనార్హం. అట్లాంటా శివారు ప్రాంతాలైన శాండీ స్ప్రింగ్స్, డన్వుడీ పోలీసులు సంయుక్తంగా అండర్ కవర్ ఆపరేషన్ ఆపరేషన్ నిర్వహించిన వీరిని పట్టుకున్నారు. మానవ అక్రమ రవాణా, వ్యభిచార ముఠాలపై మానవ అక్రమ రవాణా లక్ష్యంగా జనవరి 29, 30వ తేదీల్లో ఆపరేషన్ శాండీ స్ప్రింగ్స్ గార్డియన్ పేరుతో అమెరికాలో పోలీసులు స్టింగ్ ఆపరేషన్ నిర్వహించారు. అట్లాంటాలోని పవర్స్ ఫెర్రీ రోడ్డు సమీపంలోని హోటళ్లలో ఈ సోదాలు నిర్వహించారు. అక్రమంగా లైంగిక కార్యకలాపాలకు పాల్పడటం, వ్యభిచారం కోసం సంప్రదించడం వంటి నేరాలు కింద 8 మందిని పట్టుకున్నారు. వీరిపై సొలిసిటేషన్ ఫర్ ఇల్లిసెట్ సెక్సువల్ యాక్ట్ కింద వీరిపై కేసులు నమోదు చేశారు. ఈ ఆపరేషన్‌కు సంబంధించిన వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. కాగా, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు, ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన తెలుగువారు ఇలాంటి నేరాల్లో పట్టుబడటం ఇప్పుడు ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అరెస్టయిన చాడ సుహృత్ రెడ్డిది తెలంగాణలోని వరంగల్‌గా తెలుస్తోంది. 2020లో కాకతీయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇంజినీరింగ్ పూర్తి చేసిన అతను ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాడు. 2022లో అమెరికాలోని అరిజోనా స్టేట్ ఆఫ్ యూనివర్సిటీలో ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీపై ఎంఎస్ పూర్తి చేసినట్లు సమాచారం. వ్యభిచారం కింద అతనిపై కేసు నమోదైంది. ఈ కేసు రుజువైతే ఏడాది పాటు జైలుశిక్షతో పాటు రూ.90 వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది.

# రంగంలోకి ఈడీ

(మొదటి పేజీ (తరువాయి)

ట్రయల్‌పైనా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు దృష్టిసారించనున్నారు. కాగా, 2019 నుంచి 2024 వరకు టీటీడీకి సుమారు 68 లక్షల కిలోల కల్తీ నెయ్యి సరఫరా చేసినట్లు సీబీఐ ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణలో తేల్చింది. ఈ నెయ్యి విలువ సుమారు రూ. 235 కోట్లుగా అంచనా. నెయ్యి కల్తీ వ్యవహారంలో విచారణ ముగించిన సిట్.. ఛార్జ్‌షీట్‌లో 36 మందిని నిందితులుగా చేర్చింది. వారిలో 12 మంది టీటీడీ ఉద్యోగులు ఉన్నారు. టెండర్లలో అక్రమాలు, హవాలా మార్గాల ద్వారా లంచాలు, అక్రమ లావాదేవీలు జరిగినట్లు విచారణలో బయటపడింది. ఈ క్రమంలో ఆర్థిక అక్రమాలు, నిధుల మళ్లింపుపై ఈడీ విచారణ చేపట్టనుంది. ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి ఈడీ.. త్వరలోనే నోటీసులు జారీ చేసి విచారించనున్నట్లు సమాచారం.

# కెనడాపై విరుచుకుపడ్డ ట్రంప్

(మొదటి పేజీ (తరువాయి)

అమెరికా అధ్యక్షుడు ఒబామా తెలివి తక్కువగా ఆలోచించి ఈ వంతెన నిర్మాణానికి కావల్సిన మినహాయింపులు ఇచ్చారని ట్రంప్ విమర్శించారు. వంతెన నిర్మాణానికి అయిన ఖర్చులో సగమైనా అమెరికాకు చెల్లించాలని, లేదా వంతెనపై ఇరుదేశాలకు సమాన యాజమాన్య హక్కులు కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని కెనడాకు సూచించారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో ఇరుదేశాల మధ్య ఇటీవల తలెత్తిన విభేదాల గురించి ట్రంప్ మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా తమ దేశం నుంచి పాల ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడానికి కెనడా వసూలు చేస్తున్న సుంకాలు ఆమోదయోగ్యమైన రీతిలో లేవని ట్రంప్ మండిపడ్డారు. అమెరికాను కాదని చైనాతో వ్యాపారం చేసేందుకు ఆ దేశం మొగ్గు చూపడాన్ని ఆయన తప్పుబట్టారు. దీనికి వారు మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. వంతెన ప్రాజెక్టుకు సంబంధించిన వెబ్‌సైట్ ప్రకారం.. డెట్రాయిట్ నదిపై ఏర్పాటుచేసిన గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెనను కెనడియన్ ప్రభుత్వానికి చెందిన విండ్సర్-డెట్రాయిట్ బ్రిడ్జ్ అథారిటీ అనే సంస్థ నిర్మించింది.దీనికి అక్కడి ప్రభుత్వమే నిధులు సమకూర్చింది. ఈ ఏడాదిలో దీనిని ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ హెచ్చరికలు చేయడం గమనార్హం. అయితే ట్రంప్ ప్రకటనపై కెనడా ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# బడ్జెట్ సమావేశాలు

(మొదటి పేజీ (తరువాయి)

వివిధ శాఖల అధికారులతో అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, సభ్యుల ప్రశ్నలు, వాటికి సమాధానాలపై సమీక్షించారు. డీజీపీ సహా పోలీస్ ఉన్నతాధికారులతో స్పీకర్ అయ్యన్న కీలక సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ సమావేశాలకు కల్పించే భద్రతా ఏర్పాట్లపై చర్చించారు.

# అసెంబ్లీకి వైఎస్ జగన్

(మొదటి పేజీ (తరువాయి)

వైసీపీ అనుసరించాల్సిన తుది వ్యూహంపై స్పష్టత రానుంది. గత ఏడాది కూడా బ్జడెట్ సమావేశాల తొలి రోజున గవర్నర్ ప్రసంగ సమయంలో అసెంబ్లీకి హాజరైన జగన్, ఆ తర్వాత సమావేశాలకు దూరంగా ఉన్న విషయం తెలిసిందే. ఈసారి కూడా తొలి రోజు సమావేశాలకే పరిమితం అయ్యే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. శాసనమండలి సమావేశాలకు మాత్రం యథావిధిగా వైసీపీ మండలి సభ్యులు హాజరవుతారని సమాచారం. కూటమి ప్రభుత్వం చేస్తున్న వ్యాఖ్యలకు, ఆరోపణలకు చెక్ పెట్టే దిశగా వ్యూహాత్మకంగానే జగన్ అసెంబ్లీకి హాజరవుతున్నారని వైసీపీ నేతలు అంటున్నారు. అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంతో పాటు, కీలక అంశాలపై గట్టిగా నిలదీయాలన్నదే వైసీపీ లక్ష్యంగా కనిపిస్తోంది. శాసనసభా పక్ష సమావేశం అనంతరం పార్టీ అధికారికంగా తన నిర్ణయాన్ని ప్రకటించనుంది.

# అమెరికా వాణిజ్య ఒప్పందం భారత్‌కు దెబ్బ

(మొదటి పేజీ (తరువాయి)

అడిగినప్పుడు రష్యా చమురును నిలిపివేస్తున్నట్లు తమకు చెప్పలేదని ఖర్గే అన్నారు. అయితే ఈ ఒప్పందంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బహిరంగంగా ట్వీట్ ద్వారా ప్రకటించాడు. రష్యన్ ఫెడరేషన్ చమురు కొనుగోలును నిలిపివేయడానికి భారతదేశ నిబద్ధతను అదనపు 25 శాతం సుంకాన్ని తొలగించడానికి ఒక షరతుగా జాబితా చేసినట్లు వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్ స్పష్టంగా చెప్పింది. దీన్నిబట్టి చూస్తే భారతదేశ సార్వభౌమత్వాన్ని హరించడానికి మోడీ ప్రభుత్వం అంగీకరించింది ఎందుకు? అని ఆయన ప్రశ్నించారు. ఈ ఒప్పందం వల్ల భారతదేశ వ్యవసాయం పూర్తిగా దెబ్బతింటుందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. పప్పుధాన్యాలు, జన్యుపరంగా మార్పు చేసిన (జిఎం) ఫీడ్, ఎండిన డిస్టిలర్ల ధాన్యాలు (డిడిజిలు) అంటే మొక్కజొన్న, సోయాబీన్స్.. ఇక పశు గ్రాసం కోసం ఎర్రజొన్నలను కూడా అమెరికా నుంచి దిగుమతి చేసుకునేటట్టు సైలెంట్‌గా ఇందులో చేర్చారని ఖర్గే ఆరోపించారు. దీని ఫలితం రెండు కోట్ల రైతులు, పశువుల పెంపకందారులు నష్టోపోవచ్చని ఖర్గే హెచ్చరించారు. భారతదేశ చరిత్రలో మొదటిసారిగా.. ఒక ప్రభుత్వం మన వ్యవసాయాన్ని విదేశీ వస్తువులకు తలుపులు పూర్తిగా తెరిచింది. ఈ ఒప్పందంలో అదనపు ఉత్పత్తులు అంటే.. అర్థం ఇదే. ఈ విషయం మనకు తెలుసు. ఫిబ్రవరి 9న కొత్తగా విడుదల చేసిన వైట్ హౌస్ ఫ్యాక్ట్ షీట్‌లో 'పల్స్' అనే పదాన్ని సైలెంట్‌గా జోడించింది. అయితే ఫిబ్రవరి 6, 2026న జారీ చేసిన భారత్ ? అమెరికా సంయుక్త ప్రకటనలో ఇవి లేవు. మరోవైపు బంగ్లాదేశ్ అమెరికా పత్తి దిగుమతులకి సున్నా శాతమే పన్నులు విధించగా.. భారత్ 18 శాతం పన్నులు విధించడాన్ని ఖర్గే విమర్శించారు. 18 శాతం పన్నులు విధించడాన్న పెద్ద విజయంగా మోడీ ప్రభుత్వం చెప్పుకుంటోందని ఖర్గే ఆరోపించారు. అమెరికా భారత రైతుల కంటే బంగ్లాదేశ్‌ను ప్రోత్సహించి.. తన సొంత లాభాలను కాపాడుకుంది. తిరుపూర్, సూరత్‌వంటి వస్త్ర కేంద్రాలు 18 శాతం పన్నుల పరిధిలోకి రావడంతో భారతీయ వస్త్ర రంగానికి డబుల్ దెబ్బ తగిలింది. జాతీయ ప్రయోజనాలను, ఎగుమతి ఇంజిన్‌ను త్యాగం చేసే ప్రజా సంబంధాల ద్రోహమా అని ఖర్గే ఎక్స్ పోస్టులో ప్రభుత్వాన్ని విమర్శించారు.

# ఓం బిర్లా అవిశ్వాస తీర్మానంపై చర్చకు ఒకరోజు

(మొదటి పేజీ (తరువాయి)

ఎంపీలు మూజువాణీ ఓటు ద్వారా లేదా ఇతర ప్రత్యామ్నాయ ఓటింగ్ విధానాల్లో తమ అభిప్రాయాన్ని తెలియజేస్తారు. ప్రతిపక్షాల తీర్మానం కొన్ని నిబంధనలకు అనుగుణంగా ఉంటేనే డిప్యూటీ స్పీకర్ దాన్ని స్వీకరిస్తారు. అంటే ఎలాంటి సాంకేతిక, ఇతరత్రా లోపాలు ఉండకూడదు. తీర్మానంలో ప్రతిపక్షాలు పేర్కొన్న ఆరోపణలు స్పష్టంగా ఉండాలి. సభ్యుల వాదనలు, అభిప్రాయాలు, అన్వయాలు, అవమానకరంగా ఉండే వ్యాఖ్యలకు అవిశ్వాస తీర్మానంలో చోటు ఉండదు. ఇందుకు అనుగుణంగా ఉన్న తీర్మానాన్నే డిప్యూటీ స్పీకర్ స్వీకరిస్తారు. ఇక ఓటింగ్ రోజున సభలో ఉన్న మెజారిటీ ఎంపీలు అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటువేస్తేనే ప్రతిపక్షాల లక్ష్యం నెరవేరుతుంది. ప్రస్తుతం బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏ కూటమికి 293 ఎంపీల మద్దతు ఉంది. ప్రతిపక్ష ఐఎన్‌డీఐఏ కూటమిలో 238 ఎంపీలే ఉన్నారు. దీంతో, అవిశ్వాస తీర్మానంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

## శ్రీ సాయి బాబా నేషనల్ డిగ్రీ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం

**అనంతపురం కల్చరల్ (తెలుగోడు), ఫిబ్రవరి 10:**
అనంతపురంలోని శ్రీ సాయిబాబా నేషనల్ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే ఉచిత కంటి వైద్య శిబిరం మంగళవారం ప్రారంభమైంది. ఆంగ్ల విభాగాధిపతి ఎస్.ఐ. అలీమ్ అజ్మి , సంస్కృత విభాగాధిపతి కె. పుణ్యవతి ఆధ్వర్యంలో, ఓరియెంట్ ఆప్టికల్స్ ప్రొప్రైటర్ కె. అమ్జద్ బాషా సౌజన్యంతో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. సరిత మాట్లాడుతూ విద్యార్థులు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని, మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ పి.ఎల్.ఎన్. రెడ్డి , కళాశాల కార్యదర్శి డాక్టర్ కె. నిర్మలమ్మ మాట్లాడుతూ కంటి ఆరోగ్య ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు డాక్టర్ ఎం. రవీంద్ర ఎ. ఎర్రిస్వామి కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.



కిష్టపాడులో కుష్టువ్యాధిపై అవగాహన కలిగిస్తున్న వైద్యులు శ్రీనివాస్ బాబు. త్రివేణి. డిపిఎమ్ఓ రామచంద్ర

## కుష్టువ్యాధి నిర్మూలన, స్పర్శపై అవగాహన సదస్సు

### డీపీఎంఓ రామచంద్ర..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 10:**
పెద్దవడుగూరు మండల పరిధిలోని కిష్టపాడు గ్రామం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టువ్యాధి నిర్మూలనపై ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కిష్టపాడు వైద్యాధికారి శ్రీనివాస్ బాబు, వైద్యులు త్రివేణి, డిపిఎమ్ఓ రామచంద్ర కుష్టువ్యాధి గురించి వివరించారు. స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, కనురెప్పలు రాలిపోవటం, కాళ్ళకు చెప్పులు జారిపోవటం, చేతులతో వస్తువులను గట్టిగా పట్టుకోలేకపోవటం కుష్టు వ్యాధి లక్షణాలు అన్నారు. కుష్టువ్యాధి ఎలా సంక్రమిస్తుంది, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వైద్యసేవలపై ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామంలో అనుమానం ఉన్న వారిని పరీక్షించి లెప్రెసి ఎం సి ఆర్ చెప్పులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీనివాస్ బాబు , వైద్యులు త్రివేణి, డిపిఎమ్ఓ రామచంద్ర, ఎంపిహెచ్ఈఓ రాము, ఆశ కార్యకర్తలు, ప్రజలు, గర్భవతులు పాల్గొన్నారు.



సమ్మె వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు

## సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

### సిఐటియు ఆధ్వర్యంలో ప్రచారం

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 10:**
ఈనెల 12 నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సంఘం జయప్రదం చేయాలని కోరుతూ మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఏటీఎం నాగరాజ్ మాట్లాడుతూ సమ్మెలో మున్సిపల్ మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఈ నెల 12వ తేదీన కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున పోరాటాలకు పిలుపునివ్వడచ్చారన్నారు. రాబోవు రోజుల్లో కార్మిక సమస్యల పైన పోరాటాలు చేయడానికి ఈ సమ్మె ఉదాహరణగా ఉండాలని ప్రతి ఒక్క కార్మిక కర్షకుడు ఈ సమ్మెలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.గుత్తి మున్సిపాలిటీ అధ్యక్షులు సూర్యనారాయణ కార్యదర్శి రామాంజనేయులు ఉపాధ్యక్షుడు మహేష్ సహాయ కార్యదర్శి సుంకన్న కోశాధికారి బాల రంగన్న ఈశ్వరయ్య నల్లమ్మ పుల్లన్న భాగ్యమ్మ కే ఆంజనేయులు శ్రీనివాసులు టి ఆంజనేయులు లక్ష్మి, ఇంజనీరింగ్ వర్కర్స్ రాజా, రవి, మురళి పాల్గొన్నారు

## సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల పోస్టర్ విడుదల

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 10:**
గుత్తి మండల పరిధిలోని చేర్లోపల్లి గ్రామంలో జరగనున్నసంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287 వ జయంతికి సంబంధించిన గోడ పోస్టర్లను సేవాలాల్ మహారాజ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు /ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం సభ్యులు ,భాగ్యనగర్ బంజారా సోదరులు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సేవాగడ్ ట్రస్ట్ సభ్యులు. భూక్య వెంకటరమణ, మాట్లాడుతూ. సేవాగడ్ లో సేవాలాల్ మహారాజ్ 287వ. జయంతి సందర్భంగా దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారని. రాష్ట్రాల నుండి భక్తులు ఫిబ్రవరి 13, 14, 15 తారీకు సేవాగాడ్ కు వస్తారని భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా గుంతకల్లు మరియు చుట్టుపక్కల ఉన్న బంజారా లందరూ స్వచ్ఛందంగా వచ్చి ఈ కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ పాల్గొని .భక్తులకు ఇలాంటి ఇబ్బంది కలగకుండా సేవలు చేయాలని కోరడమైనది. మరియు భక్తులకు సౌకర్యాలు కల్పించుటకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి గారు. 50 లక్షల రూపాయలు సేవగా ట్రస్ట్ కు మంజూరు చేశారన్నారు గుంతకల్లు , గుత్తి నుండి సేవా గడుకు ప్రత్యేక బస్సు సౌకర్యము కల్పించారని అన్నారు. బంజారా సోదరులందరూ అందరూకలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, బంజారా సభ్యులు.రుప్లా నాయక్, ఏపీవో రాజశేఖర్ నాయక్, ఏడిఈఎన్, రెడ్డి నాయక్, మోహన్ నాయక్, రాము నాయక్. కృష్ణమూర్తి నాయక్. తిరుపాల్ నాయక్. దేవేంద్ర నాయక్ తదితరులుపాల్గొన్నారు.



సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల పోస్టర్లు విడుదల చేస్తున్న బంజారా సేవా సమితి నాయకులు

## గుత్తి మండలంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పర్యటన

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 10:**
:గుత్తి మండలంలో జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మంగళవారం పర్యటించారు. ముందుగా మండలంలోని రజాపురం అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో రిజిస్టర్ లను తనిఖీ చేసి, ఎంతమంది పిల్లలు ఉన్నారు, తదితర వివరాలను ఆరా తీశారు. అనంతరం తక్కువ బరువు ఉన్న పిల్లల గురించి అడిగి తెలుసుకుని వారి తల్లిదండ్రుల ఇళ్ల వద్దకు వెళ్లి విచారించారు. తక్కువ బరువు ఉన్న పిల్లల బరువు ఎలా పెంచాలి, పౌష్టికాహారం ఎలా అందించాలి అనే విషయమై



రజాపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆనంద్



రజాపురం గ్రామంలో అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ ఆనంద్

జిల్లా కలెక్టర్ పలు సూచనలు అందజేశారు. ఫోన్ ద్వారా అంగన్వాడి సూపర్వైజర్ తో మాట్లాడి తక్కువ బరువు ఉన్న పిల్లల బరువు పెంచేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.అనంతరం గుత్తి పట్టణంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు అమలు చేస్తున్న వందరోజుల ప్రణాళిక గురించి ఆరా తీశారు. పరీక్షల్లో అందరూ ఉత్తీర్ణత సాధించేలా వంద రోజుల ప్రణాళికను బాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అశ్విన్ మనిదీప్, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణ, పాఠశాల హెచ్ ఎం, పాల్గొన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతికి పకడ్బందీ ఏర్పాట్లు

### జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..

**గుత్తి (తెలుగోడు), ఫిబ్రవరి 10:**
గుత్తి మండల పరిధిలోని సేవాగఢ్‌లో జరగనున్న శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం గుత్తి మండలం సేవాగఢ్ లోని సేవాలాల్ మహారాజ్ ఆలయం పక్కనున్న సమావేశ హాల్ లో ఈనెల 13, 14, 15వ తేదీలలో నిర్వహించే శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల కోసం పోలీస్ బందోబస్తు ఏర్పాటు పక్కాగా ఉండాలని, ఎంట్రీ మరియు ఎగ్జిట్ జాగ్రత్తగా చూసుకోవాలని,



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆనంద్



సేవాలాల్ మహారాజ్ ఉత్సవాలు నిర్వహణపై సమావేశానికి హాజరైన ప్రభుత్వ శాఖల అధికారులు

ఆర్డీఓ, డిఎస్పీ సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. శానిటేషన్ కోసం అవసరమైన సిబ్బందిని నియమించాలని, ఇబ్బంది లేకుండా శానిటేషన్ చేపట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ట్రస్ట్ వారితో సమన్వయం చేసుకుని తాగునీరు అందించాలన్నారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసుకుని మానిటర్ చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని, జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం శ్రీ జగదాంబ మాత దేవాలయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అశ్విన్ మనిదీప్, గుంతకల్లు ఆర్డీఓ ఏబీవీఎస్బి శ్రీనివాస్, శ్రీ సేవాలాల్ మహారాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు కేశవనాయక్, ట్రస్ట్ నుంచి అశ్వత్థనాయక్, డిటిడబ్ల్యుఓ శ్రీనివాసరావు, డీఎల్డిఓ విజయలక్ష్మి, సేవాగఢ్ సర్పంచ్ వెంకటేష్, గుంతకల్లు మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ ఏ.బాలకొండయ్య, ఎక్సైజ్ ఎస్ఐ పి.గోపాల్ మరియు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు అఖిలభారత బంజారా సేవా సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రణాళికతో చదివితే ఫలితం అదుర్స్...

### 10వ తరగతి విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించిన ఎంఈఓ -2 హరికృష్ణ..

**బెళగుప్ప (తెలుగోడు), ఫిబ్రవరి 10:**
10వ తరగతి చదివే విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదివితే త్వరలో జరగబోవు పబ్లిక్ పరీక్షలలో ఫలితాలు అదుర్స్ గా వస్తాయని ఎంఈఓ 2 హరికృష్ణ పదవ తరగతి విద్యార్థులకు సూచించారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మండల కేంద్రమైన బెళుగుప్ప లోని పదవ తరగతి చదివే విద్యార్థులు ఇళ్ల వద్దకు వెళ్ళి విద్యార్థులు పరీక్షలకు ఏ విధంగా ప్రిపేర్ అవుతున్నారని పరిశీలించారు. అయితే కొంతమంది విద్యార్థులు సాయంత్రం ప్రిపరేషన్ లో లేకుండా ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు.



బెళుగుప్పలో పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆరా తీస్తున్న ఎంఈఓ -2 హరికృష్ణ



బెళుగుప్పలో పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ఆరా తీస్తున్న ఎంఈఓ -2 హరికృష్ణ

మార్చి 16 నుంచి జరిగే పబ్లిక్ పరీక్షలకు ఇక సమయం లేదని విద్యార్థులను చదివించే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలన్నారు. వారికి ఇంటి పనులు చెప్పకుండా చదివించేందుకు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేందుకు ప్రభుత్వము చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులతో మాట్లాడుతూ పబ్లిక్ పరీక్షలకు సమయం నెలరోజులు మాత్రమే ఉందని, ప్రణాళిక బద్ధంగా చదివితే పరీక్షల్లో మంచి మార్కులు వచ్చే అవకాశం ఉందన్నారు. సమయం తిరిగి రాదన్నారు. కావున సమయాన్ని వృధా చేయకుండా, ఏ సబ్జెక్టులో తక్కువ మార్కులు వస్తున్నాయో దానిపై శ్రద్ధ చూపి, ఆ సబ్జెక్టును మెరుగుపరచుకోవాలన్నారు. బెళుగుప్ప లో చదివే పదవ తరగతి విద్యార్థులు సాయంత్రం వేళ సరిగా ప్రిపరేషన్ లేదని నిరాశను వ్యక్తం చేశారు. ఎంఈఓ 2 తో పాటు సీఆర్పీ శంకర్, ఆర్ట్ టీచర్ రాము ఉన్నారు.



బెళుగుప్పలో మంగళవారం రాత్రి 8 గంటల వరకు పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి పబ్లిక్ పరీక్షల ప్రిపరేషన్‌పై ఆరా తీస్తున్న ఎంఈఓ -2 హరికృష్ణ

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివద్ధి సాధ్యం

### పి.కొత్తపల్లిలో సి.సి.రోడ్డు నిర్మాణానికి భూమిపూజ ..

### టిడిపి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ..

**పామిడి (తెలుగోడు), ఫిబ్రవరి 10:**
ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ద్వారనే రాష్ట్రాభివృద్ధి సాద్యం అని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు టిడిపి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ పేర్కొన్నారు. పామిడి గ్రామపంచాయతీ పరిదిలోని పి.కొత్తపల్లిలో రూ.13 లక్షల నిధులతో జరుగనున్న సి.సి.రోడ్డు నిర్మాణానికి మంగళవారం టిడిపి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసంక్షేమం అభివృద్దే మా లక్ష్యం అన్నారు. గుంతకల్లు నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతామని ప్రత్యేకించి పామిడిని అభివృద్ధి పథంలో నడిపిస్తామని తెలిపారు. అంతకుముందు టిడిపి శ్రేణులు టిడిపి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ కు ఘనస్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో పి.కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మెన్ బొల్లు శ్రీనివాసరెడ్డి, టిడిపి క్లష్టర్ ఇంచార్జ్ జింకల సంజీవకుమార్, గుత్తి మార్కెటుయార్డ్ వైస్ చైర్మన్ కొట్టం మాలిక్, పట్టణ కన్వీనర్ బొమ్మా మోహన్, ఎన్డీఏ కూటమి పార్టీల శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మనూరు ఈశ్వర్ స్వాగతం పలుకుతున్న టిడిపి శ్రేణులు

## సాలగ్రామ వైద్య శ్రీఆంజనేయ స్వామికి విశేష అలంకరణ

**తాడిపత్రి (తెలుగోడు), ఫిబ్రవరి 10:**
పెన్నానది పరివాహక ప్రాంతంలో శ్రీ వ్యాసరాయ ప్రతిష్ఠిత సాలగ్రామ వైద్య శ్రీ ఆంజనేయ స్వామికి మాఘమాస మంగళవారం పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. ఉదయం అర్చకులు కైంకర్యాలలో భాగంగా శ్రీ ఆంజనేయ స్వామికి పంచామృత అభిషేకం, అభిషేకాలు చేసి, తులసి, తమలపాకులు, వివిధ పుష్పాలతో స్వామి వారికి అలంకరించారు. అనంతరం మహా నైవేద్య వేదన, మహా మంగళహారతి గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వినియోగం చేశారు.



విశేష అలంకరణలో సాలగ్రామ వైద్య శ్రీ ఆంజనేయ స్వామి

## యాడికి మండలానికి 17 రిక్షాలు, 102 ప్లాస్టిక్ బకెట్లు

### డిప్యూటీ ఎంపీటీవో శశికళ ..

**యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 10:**
చెత్త సేకరణ కోసం యాడికి మండలంలోని పంచాయితీలకు ప్రభుత్వం 17 రిక్షాలు, 102 ప్లాస్టిక్ పెద్ద బకెట్లను పంపినట్లు డిప్యూటీ ఎంపీటీవో శశికళ తెలిపారు. యాడికి మేజర్ పంచాయతీ కు10 బిక్షాలు 60 ప్లాస్టిక్ పెద్ద ప్యాకెట్లు. కమలపాడు పంచాయతీ కు రెండు రిక్షాలు 12 ప్లాస్టిక్ బకెట్లో. సి లక్ష్మం పల్లి పంచాయితీకు ఒక రిక్షా ఆరు ప్యాకెట్లు. చందన పంచాయితీకు ఒక రిక్షా ఆరు బకెట్లు. పి వెంగన్న పల్లి పంచాయితీకు ఒక రిక్షా ఆరు బకెట్లు. పుప్పాల పంచాయతీ కు ఒక రిక్షా ఆరు బకెట్లు. వేమలపాడు పంచాయితీకు ఒక రిక్షా ఆరు బకెట్లు వచ్చాయని డిప్యూటీ ఎంపీటీవో శశికళ తెలిపారు. గ్రామ పంచాయితీ తడి చెత్త పొడి చెత్త వేరువేసి వీటిని రిక్షా ద్వారా చెత్త నుండి సంపద తయారు కేంద్రానికి తరలించాలని గ్రామ పరిశుభ్రంగా ఉంచాలని వారు తెలిపారు. వీటిని యాడికి పంచాయతీలో మంగళవారం డిప్యూటీ ఎంపీటీవో శశికళ సర్పంచ్ అనురాధ. ప్రారంభం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ తడియాల ఆదినారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



చెత్త సేకరణ రిక్షాను ప్రారంభిస్తున్న డిప్యూటీ ఎంపీటీవో శశికళ

## పురాతన ఆలయంలో గుప్తనిధుల కలకలం

### నలుగురు అరెస్ట్ ..

### తవ్వకాలకు ఉపయోగించిన సామగ్రి స్వాధీనం

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
మండలంలో గుప్తనిధుల వేట కలకలం రేపింది. కట్టకిందపల్లి గ్రామ శివారులోని పాడుబడిన పురాతన కాటమయ్య స్వామి గుడి వద్ద అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్సై సోమశేఖర్ మాట్లాడుతూ ఉదయం 9 గంటల సమయంలో గుడి పరిసరాల్లో కొందరు అనుమానాస్పదంగా తవ్వకాలు చేస్తున్నారని స్థానికులు సమాచారం ఇవ్వడంతో వెంటనే బత్తలపల్లి ఎస్సై తన సిబ్బందితో కలిసి ఉదయం పది గంటల సమయంలో సంఘటనా స్థలానికి చేరుకుని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో పట్టుబడిన వారు ధర్మవరం పట్టణానికి చెందిన బసినేని సత్యనారాయణ (అలియాస్ సత్తి), గాజుల హరికృష్ణ, మీసా శ్రీనివాసులు, బీరె రమేష్‌గా గుర్తించామన్నారు. గుప్తనిధులు ఉన్నాయనే అనుమానంతోనే తాము తవ్వకాలు చేపట్టినట్లు నిందితులు ప్రాథమిక విచారణలో అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.నిందితుల వద్ద నుంచి తవ్వకాలకు ఉపయోగించిన ఒక గడప, ఒక పారతో పాటు వారు వచ్చిన రెండు మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను స్టేషన్‌కు తరలించి తదుపరి విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.



సి.సి.రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గుమ్మనూరు ఈశ్వర్




సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామారావు, ఎంపీపీ ఈరన్న , ఐసిడిఎస్ సూపర్వైజర్ సన్నమ్మ, రాష్ట్ర వక్కలిగా కుంచిటిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ

# అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే మండల అభివృద్ధి

## అమరాపురం మండల సమావేశం...

**అమరాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా కృషి చేస్తే అన్ని విధాలుగా అభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకులు అన్నారు. మంగళవారం ఎంపీపీ ఈరన్న అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవో రామారావు, తహసీల్దార్ లక్ష్మీ నరసింహ, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, జెడ్పిటిసి సోరక్క నరసింహమూర్తి పాల్గొన్నారు.
ముఖ్య అతిథులుగా రాష్ట్ర కుంచిటిగా వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ , మడకశిర మార్కెట్ యాడ్ చైర్మన్ గురుమూర్తి, సింగిల్ విండో అధ్యక్షులు గణేష్ పేర్కొన్నారు.
ఈ సందర్భంగా ఎంపీడీవో రామారావు మాట్లాడుతూ శాఖల వారిగా ప్రగతి నివేదికలను సభ్యులకు చదివి వినిపించాలని కోరారు. మండల వ్యవసాయ అధికారి ఏ.వో. మంజునాథ్ మాట్లాడుతూ వ్యవసాయానికి సంబంధించిన నివేదిక చదివి వినిపించారు. రబీ సీజన్‌కు రాయితీపై వేరుశెనగ విత్తన కాయలు అందించామని ఇతర పరిముట్లు సబ్సిడీ గురించి వివరించారు.అలాగే ఎం.ఈ.ఓ. సత్యనారాయణ విద్యకు సంబంధించిన విషయాలను తెలిపారు. ఏ.పీ.వో. శివన్న మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం విషయాలపై వివరించారు. ఆరోగ్య శాఖ పై చర్చ జరుగుతున్నప్పుడు సభ్యులు ఎంపీటీసీ నారాయణ, సర్పంచులు అమరాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఉన్న వైద్య సేవలు అందించడం లేదని సమావేశాలకు పిలిపించాలని సభ్యులు డిమాండ్ చేశారు. అమరాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రము నందు డాక్టర్ లేకపోవడంతో కర్ణాటక రాష్ట్రం చిరుత దహళ్ళి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నకు రోగులు నిత్యము వందలాదిమంది తరలి వెళు తున్నారు. పి. ఆర్.. ఇంజనీర్ పవన్ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులను వివరించారు. ఆలధ పల్లి సర్పంచ్ ఈరన్న తాము గ్రామపంచాయతీలో అనేక పనులను అప్పులు చేసి పూర్తి చేశానని అయితే సంబంధించిన అధికారులు బిల్లులు మంజూరు చేయక అనేక ఇబ్బందులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రూ,,. 4 లక్షల అప్పుచేసి పనులు చేపట్టినట్టు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.. సంవత్సరాలు గడిచిన బిల్లులు రాకపోవడంతో వడ్డీలు చెల్లించలేక పోతున్నట్లు ఆయన వాపోయారు.. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ఐ సి. డి ఎస్ సూపర్వైజర్ సన్నమ్మ మాట్లాడుతూ మండల మండల 87 అంగన్వాడి కేంద్రాలు నడుస్తున్నాయని ప్రభుత్వం అందించే పౌష్టికాహారం గర్భవతులకు, బానింతలకు, చిన్నారులకు అందిస్తున్నామన్నారు. రాష్ట్ర కుంచిటిగా, వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మండలంలో సుప్రసిద్ధ ప్రసిద్ధిగాంచిన శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమిష్టి కృషితో నిర్వహించాలని, వారు పేర్కొన్నారు, ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలయ కమిటీ చైర్మన్ దేవాదాయ శాఖ, పురావస్తు శాఖ సహాయ సహకారాలతో ఈ నెల 15 నుంచి 21 వరకు నిర్వహించే శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు రంగ రంగ వైభవంగా జరుపుకోవాలని వారు పిలుపునిచ్చారు. శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా అగ్నిగుండ మహోత్సవం, సిడి మాను మహోత్సవం శ్రీ సిద్దేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వస్తారని వచ్చిన భక్తాదులకు కనీస సౌకర్యాలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. అదేవిధంగా అమరాపురం చెరువుకు కృష్ణా జలాలను అందిస్తామని తెలిపారు. మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి మాట్లాడుతూ భారతదేశానికి అందుల టి20 ప్రపంచ కప్ అందించిన అమరాపురం మండలం హేమావతి పంచాయితీ తంబలహట్టి గ్రామానికి చెందిన దీపిక కు అభినందనలు తెలిపారు. మండలంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని వారు తెలిపారు. రాష్ట్ర వక్కలిగ కుం చిటిగ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ, మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి వీరికి, శాలువాలు పూలమాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారి మంజునాథ్, ఇంజనీర్ అసిస్టెంట్ భార్గవ్ పశు వైద్య అధికారి కృష్ణమోహన్, ఈ. ఓ. ఆర్ డి. ప్రసాద్, ఏపీఎం ముత్యాలప్ప, ఏపీవో శివన్న,, సర్పంచులు, సదానంద గౌడ, ఈరన్న, గోవిందప్ప,జితేంద్ర, ఎంపీటీసీలు నారాయణ, ఓంకార స్వామి, కెంచప్ప, కోఆప్షన్ మెంబర్, పంచాయతీ కార్యదర్శులు మండల పరిషత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర వక్కలిగా కుంచటిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మీనారాయణ మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తికి సన్మానం చేస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న మడకశిర మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి అధికారులతో మాట్లాడుతున్న ఆలదపల్లి సర్పంచ్ ఈరన్న



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న పార్టీ పరిశీలకులు అనంతరాజు

# ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### మండలంలో విస్తృత పర్యటన..
### మండల పార్టీ పరిశీలకులు, జడ్పీటీసీ అనంతరాజు..

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
మాజీ ముఖ్యమంత్రి పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అగళి మండలంలో రచ్చబండ కార్యక్రమంలో భాగంగా మండల వైకాపా పరిశీలకులు అనంతరాజు మండలంలో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామస్థాయి గ్రామస్థాయి కమిటీల సమావేశాలను ఏర్పాటు చేస్తూ ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. అందులో భాగంగా అగళి మండలంలోని హళ్లికేరా పంచాయతీలో నియోజకవర్గ పార్టీ పరిశీలకులు రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రతి గ్రామంలో పార్టీకి అభిమానులు చురుకైన కార్యకర్తలను గుర్తించి గ్రామ కమిటీలో చేర్చాలని సూచించారు. కమిటీలో ఉండే కార్యకర్తల డేటా నేరుగా జగనన్న డాష్ బోర్డుకి లింక్ అవుతుందని వారికి పార్టీ గుర్తింపు కార్డులు జారీ చేస్తామని అన్నారు.తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసే వరకు అవిశ్రాంతంగా పని చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జగనన్న 2.0లో కార్యకర్తలకు మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, విజయ రంగయ్య గౌడ్, సీనియర్ లాయర్ అశ్వత్ నారాయణ, మండల పార్టీ కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, హళ్ళికెర సర్పంచ్ ముద్దరాజు, ఇనగలూరు సర్పంచ్ మంజుల నటరాజు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయకుమార్, భోజ గౌడ్ తిమ్మారాయప్ప, ఎంపిటిసి మంజుల సతీష్, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్,సీనియర్ నాయకులు నాగరాజు, శ్రీనివాస్,లింగరాజు పాల్గొన్నారు.



బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి బసవరాను సన్మానిస్తున్న నాయకులు

# బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి బసవరాజుకు ఘనసన్మానం

### మండల బిజెపి అధ్యక్షురాలు హెచ్ కె విక్టోరియా మహారాణి ..

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి బసవరాజు అగళి మండలంలో మంగళవారం పర్యటించారు ఈ సందర్భంగా మండల కేంద్రంలో బిజెపి కార్యాలయంలో ఆయనకు మండల అధ్యక్షురాలు విక్టోరియా మహారాణి ఆధ్వర్యంలో శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బసవరాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నాయకులకు సూచించారు .ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఈరచిక్కప్ప,హెచ్ కె విక్టోరియా మహారాణి, దొడ్డరంగే గౌడ,రవీంద్ర, కృష్ణప్ప,జయలక్ష్మి, హనుమంత రాజు తదితరులు పాల్గొన్నారు.



బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి బసవరాను సన్మానిస్తున్న నాయకులు

# బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కోటి సుధా

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
బిజెపి రాష్ట్ర మహిళా మోర్చా కార్యవర్గంలో ధర్మవరం నియోజకవర్గానికి సముచిత స్థానం లభించింది. బత్తలపల్లి మండలానికి చెందిన బిజెపి నాయకురాలు, మాజీ జెడ్పిటిసి కోటి సుధాను మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ధర్మవరం నియోజకవర్గంలో పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేసే దిశగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి సారించారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ క్రమంలోనే బీసీ సామాజిక వర్గానికి, ప్రజల్లో పట్టున్న నాయకులకు ప్రాధాన్యతనిస్తూ ఈ నియామకం జరిగినట్లు సమాచారం. కురబ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు కుటుంబానికి ఉన్న ప్రజాబలాన్ని గుర్తించి కోటి సుధాకు ఈ కీలక బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా కోటి సుధా మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిశితారాజ్‌కు, జిల్లా అధ్యక్షుడు శేఖర్‌కు, నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.



# విధుల నిర్వహణలో అంకితభావం ఉండాలి

### బత్తలపల్లి పోలీసులకు ఎస్పీ సతీష్ కుమార్ ప్రశంసలు..

**బత్తలపల్లి (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
పుట్టపర్తి శ్రీ సత్యసాయి బాబా 100వ జన్మదిన వేడుకల సందర్భంగా నిర్వహించిన బందోబస్తులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బత్తలపల్లి పోలీసు సిబ్బందిని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు. మంగళవారం అనంతపురం వెళ్తున్న క్రమంలో ఎస్పీ బత్తలపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి, విధుల నిర్వహణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు.అనంతరం, జన్మదినోత్సవాల బందోబస్తులో బత్తలపల్లి నుంచి వెళ్లి విధులు నిర్వహించిన పోలీసు సిబ్బందికి పేరుపేరునా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసులు విధులను అంకితభావంతో, క్రమశిక్షణతో నిర్వహించినప్పుడే సమాజంలో తగిన గౌరవం లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సోమశేఖర్, ఏఎస్ఐలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




ప్రశంస పత్రాలు అందజేస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



మండల పార్టీ అధ్యక్షులు జి కె ఈరన్న భార్య, ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ భార్యకు చీర అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు

# టిడిపి కుటుంబ సభ్యులతో ఆత్మీయ సమావేశం

### మహిళలకు చీర సారె..
### అన్నలా అందరించిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు..

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
మడకశిర తెలుగుదేశం పార్టీ కుటుంబంతో ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు సోమ, మంగళవారల్లో ఆత్మీయ సమావేశాన్ని క్యాంపు కార్యాలయం నిర్వహించారు. గత ఎమ్మెల్యేలకు భిన్నంగా ప్రస్తుత ఎమ్మెల్యే మడకశిర నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తుండగా అదే కోవలోనే తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి వినూత్న రీతిలో మహిళాలకు చీర లు పెట్టి అన్నగా ఆదరించారు.మడకశిర టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఎం.ఎస్.రాజు సతీసమేతంగా టీడీపీ కుటుంబ సభ్యులను ఆత్మీయంగా పలకరించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలకు చీర పెట్టి ఒక అన్నలా వారిని ఎం.ఎస్.రాజు మడకశిర నియోజకవర్గమే కాదు.....రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ కలయికతో మడకశిర పసుపు కుటుంబం ఆనందం, సంతోషంతో మురిసిపోయింది.ఈకార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు జి కె ఈరన్న, ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్, యూనిట్ ఇంచార్జ్ వెంకటేష్ వారి వారి సతుల సమేతంగా పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులతో మండల నాయకులు



మండల ప్రధాన కార్యదర్శి ఉగ్రేగౌడ్ భార్య, యూనిట్ ఇంచార్జ్ మీసేవ వెంకటేష్ భార్యకు చీర అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు

# ప్రీ ఫైనల్ పరీక్షల పరిశీలన

### ఎం ఇ ఓ శ్రీధర్ ..

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
మండలంలోని రొళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పదవ తరగతి హిందీ ప్రీ ఫైనల్ పరీక్షలను ఎం ఇ ఓ శ్రీధర్ పరిశీలించారు. నలుగు విద్యార్థులు గైర్హాజరు. విద్యార్థులు లాంగ్ ఆబ్సెంట్ అయిన వారి వివరాలను తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా తెలియజేసి తప్పకుండా పాఠశాలలకు హాజరు అయ్యేటట్లు చూడాలని చెప్పారు.పదో తరగతి విద్యార్థులు కేజీబీవీ, గురుకుల పాఠశాలలో ఉండి చదువుకునేటట్లు తల్లిదండ్రుల అనుమతి తప్పనిసరిగా తీసుకొని వారిని అక్కడికి వదలాలని ప్రధానోపాధ్యాయులకు తెలియజేసారు.ఎల్ కేపల్లి వడ్రహట్టి ప్రాథమిక పాఠశాల లో జరుగుతున్న ఎఫ్ఏ 4 ఇంగ్లీష్ పరీక్ష ను పరిశీలించారు. అదేవిధంగా పరీక్షలు ముగియగానే వెంటనే అసెస్మెంట్ పుస్తకాలను దిద్ది మార్కులు నమోదు చేసి ఆన్లైన్లో నమోదు చేయడానికి సిద్ధం చేసుకోవలెను. పై అధికారులు ఫోన్ చేసి నమోదు చేయమని చెప్పేంతవరకు ఉండకుండా వెంటనే నమోదు చేయాలన్నారు.



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంఇఓ శ్రీధర్

# రత్నగిరి గొల్లహట్టి పాఠశాల ఆవరణలో ఆపరిశుభ్రత

### భయంభయంగా గడుపుతున్న విద్యార్థులు..
### శుభ్రం చేయాలని తల్లిదండ్రుల వినతి..

**రొళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
మండల పరిధిలోని రత్నగిరి గొల్లహట్టి పాఠశాల ఆవరణలో నిల్వ చేసిన గ్రానైట్ సందులో పాములు, విషపురుగులు చేరి విద్యార్థులు ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పాండిందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో మరమ్మతుల నియమిత్తం గ్రానైట్ బండలను పాఠశాల ఆవరణంలో నిల్వ చేశారు. బండలు నిల్వ చేసి ఎక్కువ రోజులు కావడంతో వాటి సందులో పాములు, విష పురుగులు చేరి ఎప్పుడు కాటు వేస్తాయోనాన్న ఆందోళన విద్యార్థులు తల్లిదండ్రులు వ్యక్తం అవుతోంది. పిల్లలకు ఎంటువంటి హాని కలగముందే వాటిని అక్కడి నుంచి తొలగించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాల ఆవరణలో ఉన్న ఇటుక పెళ్లలు, గ్రానైట్ బండలు

# రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి


## జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
ప్రభుత్వ వైద్య సంస్థల్లో రోగులకు నాణ్యమైన, సమయానుకూల వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి స్పష్టం చేశారు. మంగళవారం పెద్దకడబూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ అందుతున్న వైద్య సేవల నిర్వహణ తీరును పరిశీలించారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ గర్భిణీ స్త్రీలతో మాట్లాడి వారికి అందుతున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తల్లి, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ఆరోగ్య కేంద్రంలోని ఫార్మసీ విభాగాన్ని పరిశీలించిన కలెక్టర్, త్వరలో గడువు ముగియనున్న మందుల వివరాలను వెరిఫై చేశారు. మందుల కొరత


వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

తలెత్తకుండా ముందస్తుగా స్టాక్ అంచనా వేసి ఇండెంట్ పెట్టాలని సూచించారు. రోగులతో మాట్లాడేటప్పుడు రఫ్‌గా కాకుండా సున్నితంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఓపీ వివరాలు ఈ – హెల్త్ రికార్డ్ సిస్టమ్‌లో డాక్టర్లు, ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు సక్రమంగా నమోదు చేస్తున్నారా లేదా అన్న విషయాన్ని కలెక్టర్ సిస్టమ్ ద్వారా పరిశీలించారు. ఫిజికల్ రికార్డుల్లో ఉన్న వివరాలు, ఆన్‌లైన్ ఓపీ రికార్డులతో సరిపోలుతున్నాయా లేదా అన్నదాన్ని కూడా తనిఖీ చేశారు. మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులకు అందిస్తున్న చికిత్స విధానాలు, అలాగే భవిష్యత్తులో ఇటువంటి వ్యాధులు వ్యాపించకుండా తీసుకుంటున్న నివారణ చర్యలపై వైద్య సిబ్బందిని కలెక్టర్ ప్రశ్నించారు. క్షయ (టీబీ), కుష్టు వ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పూర్తి చికిత్స కోర్సు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌సీడీ సర్వే – 4.0లో భాగంగా హైపర్‌టెన్షన్, డయాబెటిస్‌తోపాటు సర్వైకల్, ఓరల్, బ్రెస్ట్ క్యాన్సర్ల స్క్రీనింగ్ ప్రక్రియను ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా ఎలా నిర్వహిస్తున్నారో కలెక్టర్ వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. భాస్కర్ రాజు సహా సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


గర్భిణీలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి





మొబైల్ ద్వారా జిల్లా కలెక్టర్ కు వివరాలను తెలుపుతున్న వైద్యాధికారిణి.
పారిశుద్ధ్యంపై ఎంపీడీవో ప్రభావతి దేవిని మందలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి


రికార్డులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి

# ఎంఎస్‌జెడ్‌పీహెచ్ బాలికల పాఠశాల ఆకస్మిక తనిఖీ

## ఎమ్మెల్యే డాక్టర్ బీవీ. జయ నాగేశ్వర్ రెడ్డి ..

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
ఎమ్మిగనూరు పట్టణంలోని ఎంఎస్‌జెడ్‌పీహెచ్ బాలికల పాఠశాలను ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యం, సరుకుల నిల్వలు, రోజువారీ మెనూ అమలు, స్టోర్ రూమ్ నిర్వహణ, గుడ్లు, వేరుశెనగ–బెల్లం చిక్కీ సరఫరా, భోజన పదార్థాల నాణ్యతను ఎమ్మెల్యే పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి, భోజన నాణ్యత, మెనూ ప్రకారం భోజనం అందుతోందా, తాగునీటి సౌకర్యం, ఉపాధ్యాయుల బోధన వంటి విషయాలను తెలుసుకున్నారు. తనిఖీలో ఎటువంటి ప్రధాన లోపాలు లేవని, భోజనం నాణ్యంగా విద్యార్థులకు అందుతోందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వర్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. బిఈ సందర్భంగా 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' కింద ప్రభుత్వం అందిస్తున్న ఉత్తమ నాణ్యత గల బియ్యం, సరుకులు విద్యార్థులకు సక్రమంగా చేరేలా నిరంతరం పర్యవేక్షించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సూచించారు. పాఠశాల రాష్ట్రస్థాయిలో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల సంఖ్య పరంగా రెండో స్థానంలో నిలిచిందని ప్రశంసించారు. ఈ ఏడాది మొదటి స్థానాన్ని సాధించాలని విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు, స్థానిక నాయకులు, ఎంఈఓ, విద్యా కమిటీ చైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బివి


భారత్ గ్యాస్ మాధురి ఏజెన్సీ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి

# గ్యాస్ వినియోగదారులపై అదనపు భారం వద్దు

## జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
గ్యాస్ వినియోగదారుల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ అదనపు డబ్బులు వసూలు చేయరాదని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి స్పష్టం చేశారు. వినియోగదారులకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించడమే గ్యాస్ ఏజెన్సీల ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆమె ఆదేశించారు. మంగళవారం పెద్దకడుబూరు గ్రామ శివారుల్లో ఉన్న భారత్ గ్యాస్ మాధురి ఏజెన్సీ పనితీరును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో సిబ్బంది పనితీరు, గ్యాస్ సిలిండర్ల సరఫరా విధానం, వినియోగదారుల ఫిర్యాదులపై ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే గ్యాస్ సిలిండర్లు వినియోగదారులకు అందించాలని సూచించారు. హోమ్ డెలివరీ పేరుతో గానీ, ఇతర కారణాలతో గానీ అదనపు డబ్బులు అడిగినట్లు ఎలాంటి ఫిర్యాదులు రావొద్దని ఏజెన్సీ నిర్వాహకులను హెచ్చరించారు. వినియోగదారుల సంతృప్తే లక్ష్యంగా పని చేయాలని, ప్రజల నుంచి మంచి ఫీడ్‌బ్యాక్ వచ్చేలా సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. అదనపు వసూళ్లపై ఫిర్యాదులు అందిన పక్షంలో సంబంధిత గ్యాస్ ఏజెన్సీలపై శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఇన్ చార్జ్ సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, డీఎస్ఓ రాజా రఘువీర్, తహసిల్దార్ గీతా ప్రియదర్శిని, ఎంపీడీవో ప్రభావతి దేవి, ఆర్ఐ జెర్మియా తదితరులు పాల్గొన్నారు.

# దళితవాడపై నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోండి

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
పెద్దకడబూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనుల విషయంలో అధికారుల నిర్లక్ష్యం, వివక్ష చూపిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని మేకల రాజు, బొగ్గుల నరసన్న మంగళవారం పెద్దకడబూరుకు వచ్చిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలోని 1వ వార్డు ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి మంజూరు చేసినప్పటికీ, పనులు పూర్తిగా జరగలేదని తెలిపారు. సుమారు 350 సిమెంట్ బస్తాలను అక్రమంగా వినియోగించి, రోడ్డు నిర్మాణాన్ని అర్థాంతరంగా నిలిపివేయడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.
అలాగే ఎస్సీ కాలనీలోని పంచాయతీ భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ. 61.80 లక్షలు మంజూరు చేయగా కేవలం పిల్లర్లు, గోడల వరకు పనులు చేసి సుమారు రూ. 16.78 లక్షలను డ్రా చేసుకుని, మిగిలిన పనులను నిలిపివేశారని ఆరోపించారు. ప్రస్తుతం భవనం అసంపూర్తిగా ఉండటంతో ప్రజలకు ఉపయోగం లేకుండా పోయిందని పేర్కొన్నారు. ఇటీవల గ్రామంలో కొత్త నీటి పైపులైన్ ఏర్పాటు చేసి ఇంటింటికి తాగునీటి కనెక్షన్లు ఇచ్చినప్పటికీ, ఎస్సీ కాలనీ విషయంలో మాత్రం పైపులు వేయకుండా స్పష్టమైన వివక్ష చూపుతున్నారన్నారు. దీంతో తాగునీటి సమస్య తీవ్రంగా మారిందని తెలిపారు.
అదేవిధంగా డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ విగ్రహం ముందు ఉన్న సుమారు 100 మీటర్ల రోడ్డును కూడా నిర్మించకుండా వదిలివేయడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని అన్నారు. ఈ పరిస్థితులపై ఉన్నతాధికారులు స్పందించి, ఎస్సీ కాలనీలో జరిగిన అక్రమాలు, వివక్షపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే నిలిచిపోయిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.


కలెక్టర్ డాక్టర్ ఎ. సిరికి వినతిపత్రం అందజేసిన దృశ్యం

# నిర్దేశిత గడువులోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
హౌసింగ్ లేఔట్లలో చేపడుతున్న గృహ నిర్మాణాలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి హౌసింగ్ ఇంజినీర్లను ఆదేశించారు. మంగళవారం పెద్దకడుబూరు పెద్దకడబూరు గ్రామంలో ఉన్న హౌసింగ్ లేఔట్‌ను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆప్షన్ – 3 కింద చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెద్దకడబూరులో హౌసింగ్ లేఔట్‌లో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచడంతో పాటు పనుల నాణ్యతను తప్పనిసరిగా మెయింటైన్ చేయాలని కాంట్రాక్టర్లకు స్పష్టంగా సూచించారు. నాణ్యతలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం మంజూరు చేసిన రుణాలను సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. అధికారులు, కాంట్రాక్టర్లు, లబ్ధిదారులు సమన్వయంతో పనిచేసినప్పుడే గృహ నిర్మాణాల ప్రక్రియలో వేగం, పురోగతి సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చిరంజీవి, తహసీల్దార్ గీత ప్రియదర్శిని, ఎంపీడీవో ప్రభావతి దేవి, ఆర్ఐ జెర్మియా పాల్గొన్నారు.


జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి


జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాల వివరాలను తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ సిరి

# ఎస్సీ కాలనీలో తాగునీరు, డ్రైనేజ్ సమస్య పరిష్కరిస్తాం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి హామీ

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
పెద్దకడబూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న త్రాగునీటి, డ్రైనేజ్ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి తెలిపారు. మంగళవారం పెద్దకడబూరులోని ఎస్సీ కాలనీలో ఒకటో వార్డును సందర్శించి అక్కడి ప్రజలతో మాట్లాడి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సీ కాలనీవాసులతో కలెక్టర్ ముఖాముఖి నిర్వహించి ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక వసతులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెన్షన్లు సకాలంలో అందుతున్నాయా, పెన్షన్ పంపిణీ సమయంలో ఎలాంటి అక్రమ వసూళ్లు జరుగుతున్నాయా, గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో అదనపు డబ్బులు అడుగుతున్నారా, పారిశుద్ధ్య సిబ్బంది నిత్యం ఇంటింటా చెత్త సేకరణ చేస్తున్నారా వంటి అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. దీనికి స్పందించిన స్థానికులు, పెన్షన్లు సమయానికి అందుతున్నాయని, ఎలాంటి ననడబ్బులు వసూలు చేయడం లేదని, చెత్త సేకరణ క్రమం తప్పకుండా జరుగుతోందని కలెక్టర్‌కు వివరించారు. అయితే ఎస్సీ కాలనీలో త్రాగునీటి సరఫరా, డ్రైనేజ్ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పాటు రహదారుల సమస్యలు ఉన్నాయని, వీటిని వెంటనే పరిష్కరించాలని గ్రామ ప్రజలు కలెక్టర్‌ను కోరారు. స్పందించిన జిల్లా కలెక్టర్, సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఇన్‌చార్జ్ సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, జిల్లా సరఫరాల శాఖ అధికారి రఘువీర్‌తోపాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.


వృద్ధురాలుతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి




డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి


సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిరికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# ఎస్సీ కాలనీ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## కలెక్టర్ సిరికి వినతిపత్రం..

**పెద్దకడబూరు (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
పెద్దకడబూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, కేవీపీఎస్ మండల కార్యదర్శి దేవదాసు మాట్లాడుతూ పెద్దకడబూరులోని కల్లుకుంట గ్రామ రహదారి వెంబడి గుడిసెలు వేసుకుని నివసిస్తున్న 17 మంది పేద దళిత కుటుంబాలకు వెంటనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ కాలనీలోని అంబేద్కర్ విగ్రహం నుంచి జెడ్పీ పాఠశాల వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా సరైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, అలాగే కాలనీలో ప్రమాదకరంగా మారిన పాడుబడిన నరసప్ప బావిని వెంటనే పూడ్చివేయాలని కోరారు. కాలనీలో వీధిలైట్ల కొరత కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సీసీ రోడ్లు నిర్మించి రవాణా సౌకర్యాలు మెరుగుపరచాలని తెలిపారు. అంతేకాకుండా దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఎస్సీ కాలనీ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.


సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

# పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
ఎమ్మిగనూర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మిగనూరు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ వినతి పత్రం అందించారు. నూతనంగా విధుల్లో చేరిన 13 మంది పారిశుద్ధ కార్మికులను అప్కాస్‌లోకి ఆన్‌లైన్‌లో చేర్చాలని, పెండింగ్‌లో ఉన్న 2 నెలల జీతాలు ఇవ్వాలని, ఇంటింటి వెళ్లి చెత్త తీసుకెళ్లే తోపుడుబండ్లకు పాడైపోయిన చక్రాలు మార్చాలని, ప్రతి సంవత్సరం జాతరకు కార్మికులకు దుస్తులు ఇవ్వడం ఆనవాయితీ, అని, ఈ సంవత్సరం కూడా తక్షణమే కార్మికుల బట్టలు ఇవ్వాలని, పారిశుద్ధ కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని , పారిశుద్ధ కార్మికులకు నూనె, సబ్బులు, చెప్పులు, పనిముట్లు ఇవ్వాలని కోరారు.


నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి

# వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

**ఎమ్మిగనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
స్థానిక విశాల గార్డెన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన నందవరం మండల డిప్యూటీ ఎంపీడీఓ సందీప్ కుమార్తె వివాహ వేడుకకు ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన దంపతులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్మన్, ఏఎంసీ చైర్మన్, నందవరం ఎంపీడీఓ, నందవరం మండల టీడీపీ అధ్యక్షులు, మండల నాయకులు, పట్టణ కార్యదర్శి, టౌన్ బ్యాంకు డైరెక్టర్స్, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.


వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ బీ.వీ. జయ నాగేశ్వర్ రెడ్డి

# దక్షిణ కాశీ క్షేత్రం.. శ్రీముఖలింగం...

### వంశధార తీరాన వెలసిన అతిపురాతన శైవ క్షేత్రం
### 15 నుండి మహా శివరాత్రి మహెూత్సవాలు..
### 1 న వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు పకడ్బందీ ఏర్పాట్లు ..

**ఎల్ఎన్ పేట (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలంలో వంశధార నదీతీరాన వెలసిన అతి పురాతన వెలసిన శైవ క్షేత్రం శ్రీముఖలింగం. విప్పచెట్టు మొదల నుండి శివలింగం ఉద్భవించినట్టుగా చరిత్ర చెబుతోంది. శివలింగంపై శివుని ముఖం చెక్కబడి ఉండడంతో ఈ క్షేత్రానికి శ్రీముఖలింగం అని పేరు వచ్చింది. సాధారణ లింగాలకు భిన్నంగా శివుని ముఖం కన్పించే ఏకైక క్షేత్రం కావడంతో దక్షిణ కాశీగా పిలుస్తారు.


శ్రీముఖ లింగం ఆలయం

కోటి లింగాలకు ఒక లింగం తక్కువ కలిగిన ఆలయం రాతి కట్టడాలుతో నిర్మాణం చేపట్టారు. ఆలయంలోని శివలింగాన్ని ఏ దిశ నుంచి చూసినా మన వైపు చూస్తున్నట్లుగా ఉంటుంది. ఆలయ గోపురం చాలా ఎత్తుగా ఉంటుంది. కాశీలో లింగం, గంగలో స్నానం, శ్రీశైలంలో శిఖరం, శ్రీముఖలింగంలో ముఖ దర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని భక్తులు నమ్మకం. ముఖలింగేశ్వరుని దర్శించుకుని ఆలయం పక్కనే ఉన్న ఆంజనేయస్వామి దర్శించుకోవడం ఆనవాయితీ. మూడు చోట్ల ముక్కోనపాకారంలో మూడు ఆలయంలో ఉన్నాయి. ప్రధాన ఆలయ మధుకేశ్వర చుట్టూ సుందరమైన క్యూ కాంప్లెక్స్ పచ్చని మొక్కలతో సుందరమైన పార్కుగా ఏర్పాటు చేశారు. దీనికి అభిముఖంగా కొంత దూరంలో భీమేశ్వరాలయం. ఈ రెండు ఆలయాలకు కాస్త దూరంగా గ్రామానికి ప్రవేశం లో అధునాతన వాస్తు పద్ధతి అద్భుత సోయగాల సోమేశ్వర ఆలయం భక్తులకు ఆహ్వానం పలుకుతున్నాయి. శిల్పకళా సంపద చూపరులను కనువిందు చేస్తుంది. ఆలయం చాణిక్య శిల్పకళ వైభవానికి దర్పణం పడుతుంది. దేవాలయ పరిసరాల లో ఉన్నంత సేపు భగవంతునిని భక్తి ప్రవర్తలతో పాటు మనసును ఆహ్లాదం కలిగించే వాతావరణ కన్పిస్తుంది. ఆలయంలో గోలెం కు ప్రత్యేక చరిత్ర ఉంది.


వారాహి అమ్మవారు

ఈ క్షేత్రంలో ఈనెల 15 తేదీ నుంచి మహా శివరాత్రి మహెూత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు అధికారులు చేపట్టారు. జిల్లా కలెక్టర్ స్వప్నల్ దినకర్ పుండ్కర్ , జిల్లా ఎస్పీ కే.వీ.మహేశ్వర రెడ్డి పర్యటించి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కాకుండా పగడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఆలయం వద్ద క్యూలైన్ మంచినీటి వసతి పబ్లిక్ అడ్రస్ సిస్టం


శ్రీముఖలింగం

పనులు, మెడికల్ టీమ్స్ అంబులెన్స్ సిద్ధంగా ఉంచారు. మహాశివరాత్రి మహోత్సవంలో అత్యంత కీలక ఘట్టం చక్ర తీర్థ స్నానం. ఈనెల 18వ తేదీన ఉదయం 10 గంటలకు భక్తులకు దర్శనం ఇచ్చి మధ్యాహ్నం 12 గంటలకు చక్రతీర్థయాత్ర ప్రారంభమవుతుంది. పోలీస్ బందోబస్తు మధ్య నంది వాహనం పై పార్వతీ పరమేశ్వర ఉత్సవ విగ్రహాలు ఎల్ ఎన్ పేట మండలం మిరియాపల్లి గ్రామం వంశధార నదీ తీరానికి తీసుకువచ్చి స్వామి వారికి చక్ర తీర్థ స్నానం ఆచరించనున్నారు. అత్యంత ప్రాముఖ్యత కలిగిన చక్ర తీర్థ స్నానాలకు ఒడిసా, ఆంధ్ర రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తు,సీసీ కెమెరాలు నిఘా ఉంచి, గజ ఈతగాళ్లు సిద్ధం చేసి ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందుస్తు చర్యలు చేపట్టి శివరాత్రి వేడుకలకు చర్యలు తీసుకుంటున్నారు.


ఆత్మహత్య చేసుకున్న శిల్ప

## వివాహిత ఆత్మహత్య

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
మండల పరిధిలోని కెంచన బల్ల గ్రామంలో వివాహిత మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి కెంచన బల్ల గ్రామానికి చెందిన ఆనందరావు భార్య శిల్ప (33) స్థానిక పెద్ద చెరువు సమీపంలో తన చీరతో చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం కెంచన బల్ల , సింగసముద్రం ప్రధాన రోడ్డు కావడంతో వాహనాలు రాకపోకలతో చుట్టుపక్కల గ్రామాల స్థానికులు కెంచనబల్ల గ్రామస్తులకు సమాచారం అందించారు. మృతురాలి సోదరుడు విజయ్ కుమార్ స్థానిక పోలీసులకు ఫిర్యాదుతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని శవాన్ని పంచనామా నిమిత్తం కుప్పం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## జిల్లాస్థాయి సాంస్కృతిక పోటీల్లో విద్యార్థి ప్రతిభ

**రామకుప్పం (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
మండల కేంద్రంలోని బాలుర భవిత పాఠశాలలో చదువుతున్న కృష్ణరాజపురం గ్రామానికి చెందిన నరేష్ జిల్లాలోని జ్యోతిరావు పూలే భవనంలో ఆర్ట్స్ మరియు సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థి నగేష్ పాటలతో పలువురిని అలరించాడు. పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించాడని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు ఘనంగా అభినందించి సత్కరించారు.



## బుల్లెట్ చోరీ నిందితులకు రిమాండ్

### ఎస్ఐ హేమంత్ కళ్యాణ్

**హిరమండలం (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
హిరమండలం పట్టణంలోని గిరిజాలవీధిలో బుల్లెట్ దొంగిలించిన నిందితులకు రిమాండ్ విధించినట్లు ఎస్ ఐ వి. హేమంత్ కళ్యాణ్ తెలిపారు వాహనం దొంగతనం కు సంబంధించి 2025లో ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. దొంగతనానికి పాల్పడిన ముగ్గురు నిందితులను పట్టుకుని, బుల్లెట్ వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. వీరిని కొత్తూరు జెఎంఎఫ్సీ కోర్టు లో హాజరు పరచగా 15 రోజులు రిమాండ్ విధించారని ఎస్ ఐ తెలిపారు. వీరిని అంపోలు జైలుకు తరలించినట్లు ఆయన చెప్పారు.

## ఇరిగేపల్లిలో అక్షర ఆంధ్ర

### ఉపాధ్యాయుడిలా మారిన ఎంపీడీవో గంగాధర్..

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
మండల పరిధిలోని ఇరిగేపల్లి గ్రామంలో మంగళవారం ఎంపీడీవో గంగాధర్ ఉపాధ్యాయుడిలా గ్రామంలోని వయోజనులకు అక్షర ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొందే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరచడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. 15 నుండి 59 సంవత్సరాలు లోపు వయస్సు గల వయోజనులకు 2029 నాటికి నూరు శాతం అక్షరాస్యత సాధించే లక్ష్యంతో చదవడం వ్రాయడం జీవన నైపుణ్యాలు తదితర వాటిని నేర్పించడానికి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోతోపాటు ఇరిగేపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


అక్షరాభ్యాసం చేస్తున్న ఎంపిడిఓ గంగాధర్

## రబీ సాగుకు వంశధార నీరు విడుదల

**హిరమండలం (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
రైతులు చేపడుతున్న రబీ సాగుకు హిరమండలం వద్ద నిర్మాణం చేపట్టిన వంశధార(బొడ్డేపల్లి ) జలాశయం నుండి సాగునీరు సరఫరాకు అధికారులు చర్యలు చేపట్టారు. గొట్టా బ్యారేజ్ సాగు నీటి ప్రాజెక్టు ఒడిశా క్యాచ్ మెంట్ ఏరియాలో వర్షాలు కురవకపోవడంతో పాటు స్థానికంగా వర్షా లేకపోవడం వలన వంశధార నదీ లో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. దీంతో కాలువ ఆయకట్టు భూములకు సాగు నీరు సరఫరా కు ఇబ్బందులు కలుగుతుంది. ఈ నేపథ్యంలో పంట భూములకు సాగు నీరు సరఫరాకు ఆటంకం ఏర్పాడుకుండా జలాశయం నీరు విడిచిపెట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వంశధార కట్టడాల విభాగం హిరమండలం డివిజన్ ఈ ఈ బోర. రవీంద్ర జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. హిరమండలం, ఎల్ ఎన్ పేట,సరుబుజ్జిలి మండలాల లోని చెరువులు నింపడం జరుగుతుందని ఆయన చెప్పారు. కాలువ ద్వారా 250 క్యూసెక్కుల నీరు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. రైతులు సాగునీరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


వంశధార నీరు విడుదల చేసిన దృశ్యం

## ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

### ఆయుర్వేద డాక్టర్ సూర్యకుమారి..

**ముద్దనూరు (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
ముద్దనూరులోని ఎస్.విరి కాలనీలో ఆయుర్వేదంపై కాలనీవాసులకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆయుర్వేద చికిత్స విభాగం డాక్టర్ సూర్యకుమారి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచమంతా ఇప్పుడు ఆయుర్వేద చికిత్స విధానంపై ఆసక్తి చూపుతోందని అన్నారు. ఆయుర్వేదం మందులు ప్రకృతిలో ఉండే చెట్ల ఆకులు, బెరడు నుండి, తీసిన పొడిని, దేహాన్ని, మరికొన్ని ప్రకృతిలో సహజంగా దొరికే వస్తువుల ద్వారా మిళితం చేస్తూ వ్యాధుల పూర్తి నివారణకు దోహదం చేసే విధంగా ఉంటుందన్నారు. ఈ ఆయుర్వేద మందులు అనేది సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా నిదానంగా ఒక వ్యాధి రావడానికి మూల కారణమైన వాటిని తొలగిస్తూ, తర్వాత వ్యాధికి గల క్రిమిని పూర్తిగా సంహరించి మన ఆరోగ్యాన్ని మెరుగుపరిచే విధంగా చేస్తుందని తెలిపారు. అనంతరం కాలనీ వాసులకు వారు తెలిపిన వ్యాధులను బట్టి ఆయుర్వేద మందులు ఇస్తూ ప్రతిరోజు క్రమం తప్పకుండా చెప్పిన సమయానికి ఎలా వాడాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేదం అసిస్టెంట్ నర్స్ సుకన్య, ఏఎన్ఎం నర్సు ఇందిరమ్మ. ఎంపీహెచ్ఏ జయాకర్, ఆశ వర్కర్ భారతి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం మందులు పంపిణీ చేశారు.



మాట్లాడుతున్న ఆయుర్వేద డాక్టర్ సూర్యకుమారి

## మోపాడు రిజర్వాయర్ కాలువ, కల్వర్టు పనుల క్షేత్రస్థాయి పరిశీలన

### మండల క్లస్టర్ కో కన్వీనర్ వేముల బాలకృష్ణ..

**ఉదయగిరి/కొండాపురం (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
ఉదయగిరి నియోజకవర్గంలోని కొండాపురం మండలంలో తూర్పు ఎర్రబెల్లి గ్రామ పంచాయతీలో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో సుమారు 13 లక్షల రూపాయలతో జరుగుతున్న మోపాడు రిజర్వాయర్ కాలువ కల్వర్ పనులను స్థానిక నేత, మండల క్లస్టర్ కో కన్వీనర్ వేముల బాలకృష్ణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వేముల బాలకృష్ణ మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్, కనిగిరి నియోజకవర్గ శాసనసభ్యులు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలోని మోపాడు రిజర్వాయర్ పరిధిలోని కొండాపురం మండలం సంబంధించిన కాలువకు సుమారు 13 లక్షల రూపాయలు మంజూరు చేసి కాలవ ఆధునీకరణ పనులను, కల్వర్టు పనులను చేయడం ద్వారా స్థానిక గ్రామ రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. అనేక ఏళ్లుగా కాలువ నీళ్లు ప్రవహిస్తున్నప్పుడు రైతులు నీటిలో నుంచి వెళ్లాలంటే రైతులు ఎరువులు తరలించాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ప్రస్తుతం ఇరువురు ఎమ్మెల్యేల సహకారంతో కల్వర్టు నిర్మాణం ద్వారా శాశ్వత పరిష్కారం చూపారని తెలియజేశారు. పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ ను పనులకు సంబంధించిన క్యూరింగ్ తదితర విషయాలు చర్చించి పలు సూచనలు తెలిపారు. ఈ కాలువ పరిధిలోని రైతులు తరపున ఇరువురు శాసనసభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. భవిష్యత్తులో తూర్పు ఎర్రబెల్లి గ్రామ పంచాయతీలో మరింత అభివృద్ధి కార్యక్రమాలు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సహకారంతో చేపట్టి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో వినయ్ , హరీష్, శ్రీకాంత్, కొండయ్య, స్వామి దాసు,తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కల్వర్టు పనులను పరిశీలిస్తున్న మండల క్లస్టర్ కో కన్వీనర్ వేముల బాలకృష్ణ


కల్వర్టు పనులను పరిశీలిస్తున్న మండల క్లస్టర్ కో కన్వీనర్ వేముల బాలకృష్ణ


సుందర అలంకరణలో శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి శ్రీ రాజరాజేశ్వర దేవి

## శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**తాడిపత్రి (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
స్థానిక శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో మంగళవారం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమైనాయి. శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి రోజున వేకువ జామున ఆలయ అర్చకులు శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, అభిషేకాలు, విశేష పూజలు గావించి, స్వామి వారిని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. గోమాతకు పూజలు చేసి, గోమాతతో ఆలయ ప్రదక్షిణ గావించి, యాగశాల ప్రవేశం, గణపతి పూజ, పుణ్యావాచనం, అఖండ స్థాపన కార్యక్రమాలతో అంకురార్పణ జరిగింది. ఆలయంలోని శ్రీ రాజరాజేశ్వరీ దేవి ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈనెల10నుంచి 20వ తేదీ వరకు కొనసాగునున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల వేడుకలకు భక్తుల సౌకర్యార్థం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. బ్రహ్మోత్సవాలలో ప్రత్యేక ఆకర్షణగా విద్యుత్ దీప కాంతుల ఏర్పాట్లను మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆలయ చైర్మన్ చంద్రమోహన్ పర్యవేక్షిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజూ నిర్వహించే కార్యక్రమాలలో భక్తులుపాల్గొని స్వామి వారి అనుగ్రహం పొందాలని కోరారు.




గోవుతో ఆలయ ప్రదక్షిణ గావిస్తున్న దృశ్యం

## విద్యార్థులకు గుగ్గిళ్లు పంపిణీ

### హిందీ ఉపాధ్యాయులు నయాబ్ రసూల్..
### ఎంఈఓ -2 చంద్రశేఖర్ నాయుడు..

**అగళి (తెలుగోడు), ఫిబ్రవరి 10 :**
మండల పరిధిలోని పి. బ్యాడిగెర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తరగతుల నిర్వహణలో విద్యార్థులకు హిందీ ఉపాధ్యాయులు నయాబ్ రసూల్ గుగ్గిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ -2 చంద్రశేఖర్ నాయుడు ఉపాధ్యాయులకు ధన్యవాదములు తెలిపారు. ఎంఈఓ -2 చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ గుగిళ్లు పిల్లల ఆరోగ్యానికి ఎంతగానో దోహదపడతాయని వాటిని తినడం వల్ల చాలా ఉపయోగకరం అని అన్నారు.


విద్యార్థులకు గుగ్గిళ్లు పంచుతున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు



పోస్టర్లు విడుదల చేస్తున్న యూటీఫ్ నాయకులు

# పేద పిల్లలకు ఊరి బడే ఊపిరి

**విద్యారంగం పరిరక్షణకు నడుం బిగిద్దాం.. యుటిఎఫ్ నాయకులు**

రోళ్ల (తెలుగోడు), ఫిబ్రవరి 10 :
మడకశిర పట్టణంలోని శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయ భవన ప్రాంగణంలో మడకశిర మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వీ.ఎన్. మాలింగప్ప, వై.జోగప్ప ఆధ్వర్యంలో "ప్రభుత్వ బడిలో విద్యార్థులను చేర్పిద్దాం ఊరి బడిని కాపాడుకుందాం" పోస్టర్లు విడుదల చేసారు. ఈ సందర్భంగా శ్రీ సత్య జిల్లా యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కే. భూతన్న జిల్లా కార్యదర్శి డి. నరసింహప్ప మాట్లాడుతూ "అధ్యయనము అధ్యాపనము సామాజిక స్పృహతో సమాజ అభివృద్ధి కాంక్షిస్తున్న ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ అంటూ బడి అంటే ఉపాధ్యాయులు, విద్యార్థి, నాలుగు గోడలు, సిలబస్, పరీక్షలు, ర్యాంకులు మాత్రమే కాదు. ఈ బడి చుట్టూ సమాజం ఉంది. భవిష్యత్తులో ఈ బడిలో తయారయ్యే బాలబాలికలు సమాజ అవసరాలు తీర్చగలిగిన వనరులుగా మారాలి అనేది విద్య యొక్క లక్ష్యం. ఆ లక్ష్య సాధన మన చేతుల్లోనే ఉంది. కాబట్టి అటువంటి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించుకోవడం ఉపాధ్యాయు లందరి బాధ్యతని, భావిభారత పౌరులను సమాజం పట్ల బాధ్యతగా, కుటుంబం పట్ల గౌరవంగా, తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకునే పౌరుడుగా తయారు చేయటం మన బాధ్యతగా భావించి పని చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

2026-27 నూతన అకాడమిక్ సంవత్సరం 2026 జూన్ ప్రారంభం కాబోతుంది. బడి ఈడు కలిగిన పిల్లలందరూ మన ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించే దానికోసం ఉపాధ్యాయులుగా మనం ప్రత్యేక భాధ్యతలు తీసుకోవాలి. తల్లిదండ్రులకు ప్రభుత్వ బడి పట్ల నమ్మకాన్ని కలిగించే బాధ్యతను కూడా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఒకప్పుడు ప్రభుత్వ బడి నీతి, నిజాయితీగా కులమత బేధం లేకుండా అందరం కలిసి ఉండే సమానత్వ భావం నేర్పింది. మన భవిష్యత్తుకు భరోసా నిస్తూ మనకి ఆర్థిక శక్తి నిచ్చింది. మన బిడ్డల్ని తీర్చి దిద్దుకునే అవకాశం ఇచ్చింది. ఇప్పుడు అలాంటి బడి బలహీనం కాకుండా బలోపేతం కోసం మనం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రభుత్వ బడిలో ఉన్న సదుపాయాలని పిల్లల తల్లిదండ్రులకు చెప్పి, వారిలో ప్రభుత్వ బడిపై నమ్మకాన్ని కలిగించాలి. మీ బిడ్డలను భావిభారత పౌరులుగా సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన మనుషులుగా తీర్చిదిద్దుతామనే ఒక భరోసా, నమ్మకాన్ని సమాజానికి కల్పించే పని చేద్దామని చెప్పారు. అందుకోసమే యూటీఫ్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు 2026 ఫిబ్రవరి నుండి క్యాంపెయిన్ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ పనిలో యూటీఎఫ్ నాయకులు , కార్యకర్తలే కాకుండా ఉపాధ్యాయ మిత్రులందరూ భాగస్వామ్యం కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీదేవి శాంతమ్మ యుటిఎఫ్ తాలూకా సమన్వయకర్త టి.మూడ్ల గిరియప్ప, మండల గౌరవ అధ్యక్షులు ఈ. నరసింహమూర్తి, కోశాధికారి బి ఈశ్వరప్ప, సీనియర్ నాయకులు సి.పి. రవీంద్ర, వి. హనుమంతరాయ, నవీన్, శివన్న, సురేష్, అశోక్,సూర్య ప్రకాష్, కొత్తరాయుడు పాల్గొన్నారు.

# ఈహెచ్ఆర్ అమలు పరిశీలన

**అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్..**

యాడికి (తెలుగోడు), ఫిబ్రవరి 10 :
: యాడికి ప్రభుత్వ వైద్యశాలల్లో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్స్ (ఈహెచ్ఆర్) అమలు సాధ్యాసాధ్యాలపై ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్ పరిశీలించారు. ఈహెచ్ఆర్ అమలుకు యాడికి ప్రభుత్వ వైద్యశాలను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. ఈహెచ్ఆర్ ఎంతవరకు అమలుచేయవచ్చు, దీనిపై అవగాహణ చర్యలు, అమలులో అవరోధాలు వంటి విషయాలు చర్చించారు. ఈహెచ్ఆర్ అమలైతే ప్రతి రోగికి ఒక ఐడీనెంబర్ కేటాయింపు, కేస్ స్టడీ లాంటి అన్ని వివరాలు అందులో నమోదుచేస్తారు. చికిత్స కోసం రాష్ట్రంలోని ఏ వైద్యశాలకు వెళ్లినా పేషంట్ వివరాలు, రోగాలు గతంలో తీసుకున్న వైద్య చికిత్స లాంటి వివరాలన్నీ ఇందులో నమోదై ఉంటాయి. పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన యాడికి ప్రభుత్వ వైద్యశాలలో ఈహెచ్ఆర్ అమలు అయితే రోగులకు మరింత మెరుగైన సేవలు అందనున్నాయి. అనంతరం గర్భవతులకు చికిత్స అందించారు. అనంతరం సివిఆర్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గర్భవతులకు అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్ భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రాహేర్. వైద్యాధికారి పరమేష్. డాక్టర్ సాయి సుమంత్ రెడ్డి. మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు. రాంప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.



## శ్రీశైలంలో సంప్రదాయాలకు నీళ్లు..

# గ్రామోత్సవంలో అపచారం ...

**భక్తుల రద్దీ సాకుతో
అర్ధాంతరంగా గ్రామోత్సవం రద్దు..
శివస్వాములు, భక్తుల ఆగ్రహం..**



శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 10 :
శ్రీశైలం మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల రెండవ రోజు అధికారుల నిర్లక్ష్యం సమన్వయ లోపంతో స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం నిలుపుదల చేయడంతో శివస్వాములు , శివ భక్తులు ఆగ్రహ ఆవేశాలు వ్యక్తం చేశారు. ఎన్నడూ లేని విధంగా శ్రీశైలంలో మహా అపచారం జరిగిందని అంటున్నారు. భక్తులు రద్దీ ఎక్కువ ఉంటే గ్రామోత్సవం నిలుపుదల చేయటం ఎన్నడూ చూడని విడ్డూరంగా ఉందని భక్తులు వాపోతున్నారు. మహాశివరాత్రి గ్రామోత్సవం నిర్వహించే మొదటి రోజే ఉత్సవమూర్తులు పురవీధుల్లో తీసుకురాలేకపోవడం , అధికారుల నిర్లక్ష్య ధోరణి, అధికారులకు శివపార్వతులపై ఉన్న కపట భక్తి, హిందూ సాంప్రదాయాలను నీళ్ల వదిలేలాగా ఉన్నాయని భక్తులు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడడైనా వర్షం కారణంగా గ్రామోత్సవం నిలుపుదల చేస్తారే తప్ప భక్తుల రద్దీ సాకు చూసి కాదు. అధికారులు తీసుకున్న తప్పుడు నిర్ణయాలు, సమన్వయం లోపం వల్ల స్వామివార్లకు జరిగే ఉత్సవాలను నిలుపుదల చేయటాన్ని హిందూ సంఘాలు, శివ స్వాములు వ్యతిరేకిస్తున్నారు. ఇందుకు బాధ్యులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లోక కళ్యాణం కోసం నిర్వహించే ఉత్సవాలలో అలసత్వం చూపటం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. ఎంతో భక్తి శ్రద్ధలతో లోక కళ్యాణాన్ని కాంక్షిస్తూ ద్వారకా తిరుమల దేవస్థానం తరపు నుంచి వచ్చిన పట్టు వస్త్రాలకు కూడా నిలిపివేయడం మహా అవచారంగా భక్తులు భావిస్తున్నారు. శ్రీశైలంలో ఎన్నడు శివ స్వాములకు ఇటువంటి పరిస్థితులు ఎదురు కాలేదని, గ్రామోత్సవం నిలుపుదల చేయటం, పట్టువస్త్రాలు సమర్పణ నిలుపుదల చేయటం అపశకునాలుగా భావిస్తున్నట్లు భక్తులు, శివస్వాములు వాపోతున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఎటువంటి అపచారాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని హిందూ సంఘాలు, శివ స్వాములు, భక్తులు కోరుకుంటున్నారు



డైరెక్టర్ ఎన్ శంకర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కోదండరామ్

# డైరెక్టర్ ఎన్ శంకర్‌ను పరామర్శించిన ఎమ్మెల్సీ కోదండరామ్

హైదరాబాద్, ఫిబ్రవరి 10 :
ప్రముఖ దర్శకుడు శంకర్ తల్లి సక్కుబాయమ్మ ఇటీవల కన్నుమూశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ కోదండరామ్ ఎన్ శంకర్ నివాసంలో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని చెప్పారు.

# మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

**భక్తుల సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి
జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి..
జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్..**

శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 10 :
మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానానికి విచ్చేయు లక్షలాది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి, జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం శ్రీశైలం దేవస్థానంలో భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ కలిసి క్షుణ్ణంగా పరిశీలించారు.దేవస్థానం ప్రారంభ ద్వారం నుండి భక్తుల క్యూ లైన్లు, క్యూ లైన్లలో ఏర్పాటు చేసిన త్రాగునీరు, అల్పాహార పంపిణీ కేంద్రాలు, శానిటేషన్ ఏర్పాట్లు తదితర అంశాలను చివరి వరకు పరిశీలించి, మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. శివ స్వాములు విశ్రాంతి తీసుకునే చంద్రావతి కళ్యాణ మండపాన్ని సందర్శించి అక్కడ కల్పించిన సదుపాయాలపై భక్తులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గుడి వెలుపల ఉన్న క్యూ లైన్ల నుండి అమ్మవారి దర్శనం అనంతరం నిష్క్రమణ వరకు ఏర్పాటైన మార్గాలను తనిఖీ చేసి, భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన అల్పాహారం, త్రాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించారు. భద్రత పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి భక్తుడిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, ప్రధాన ద్వారం నుండి దర్శనం అనంతరం నిష్క్రమణ మార్గాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు (ఐఖీవీణలు) ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విధి నిర్వహణలో ఉన్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య తలెత్తిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సిబ్బందికి తెలిపారు.మహాశివరాత్రి పర్వదినాన భారీగా భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో అదనంగా చేపట్టిన ఏర్పాట్లను కూడా కలెక్టర్, ఎస్పీ పరిశీలించి అవసరమైన మార్గనిర్దేశం చేశారు. భక్తులు పోలీసు అధికారుల సూచనలను పాటిస్తూ తమ వాహనాలను ఇతరులకు ఆటంకం కలగకుండా నిర్ణీత పార్కింగ్ ప్రాంతాల్లో పార్కింగ్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు అదేవిధంగా కాలినడకన వచ్చే భక్తుల సౌకర్యాలు కైలాస ద్వారం వద్ద దేవస్థానం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు భక్తులతో నేరుగా అడిగి ఏర్పాట్ల గురించి మరియు మెడికల్ క్యాంపులు అన్నదాన శిబిరాల నిర్వహణ గురించి కలెక్టర్ రాజకుమారిగనియా తానే స్వయంగా వెళ్లి పరిశీలించారు ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు, దేవస్థాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



భక్తులతో మాట్లాడుతున్న ల్లా కలెక్టర్ జి. రాజకుమారి



భక్తులతో మాట్లాడుతున్న ల్లా కలెక్టర్ జి. రాజకుమారి



శ్రీశైలంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ సునీల్ షోరాన్

# హంస వాహనంపై ఆదిదంపతులు


శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 10 :
శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన మంగళవారం నాడు శివపార్వతులు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి అమ్మవార్ల యాగశాలలో ప్రత్యేక పూజలు అర్చక స్వాములు ఆగమ శాస్త్రానుసారంగా నిర్వహించారు . సాయంకాలం పూజల అనంతరం స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను అక్కమహాదేవి అలంకరణ మండపంలో నూతన వస్త్రాలతో పలు రకాల పూలతో అలంకరించి అలంకరణ పూజలను అర్చక స్వాములు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు మరొకమారు స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులకు మహా మంగళహారతులు ఇచ్చి మేళతాళాల నడుమ మంగళ వాయిద్యాలు నడుమ స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ రాజగోపురం గుండా గ్రామోత్సవానికి తోడుకొని వచ్చారు ఈ గ్రామోత్సవం శ్రీశైలం పురవీధుల్లో ఎంతో వైభవంగా ముందుకు సాగింది ఈ గ్రామ ఉత్సవంలో దేవస్థానం వారు ఏర్పాటు చేసిన కళాకారుల విన్యాసాలు డప్పు వాయిద్యాలు మేళ తాళాలు గురవాయా నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను చూసి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులతో నీరాజనాలు పలికారు ఈ విశేష కార్యక్రమంలో కార్యనిర్వహణ అధికారి ఎం శ్రీనివాసరావు దంపతులు , ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పి రమేష్ నాయుడు ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు అధికారులు అర్చక వేద పండితులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



గ్రామోత్సవానికి తోడుకొని వస్తున్న అధికారులు



ఉత్సవమూర్తులకు పూజలు చేస్తున్న అర్చక స్వాములు



గ్రామోత్సవంలో కళాకారుల విన్యాసాలు

# శివనామ స్మరణతో మారుమోగుతున్న శ్రీగిరులు

**శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు**

శ్రీశైలం (తెలుగోడు), ఫిబ్రవరి 10 :
ప్రముఖ శైవ క్షేత్రంగా శక్తిపీఠంగా విరాజిల్లుతున్న శ్రీశైల మహా క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు దేశ నలమూలల నుండి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. భక్తులు పవిత్ర పాతాళ గంగలో పుణ్య స్నానాలుఆచరించి శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకునేందుకు వేకువ జాము నుండే క్యూ లైన్‌లో వేచి ఉంటున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ అధికారులు ఆలయ వేళలో మార్పులు చేశారు. దేశ నలుమూలల నుండి శివ స్వాములు శివ భక్తులు కాలినడకన, సొంత వాహనాలలో అధిక సంఖ్యలో శ్రీశైలం చేరుకుంటున్నారు. భక్తుల రాకతో శ్రీశైలం నిండిపోయింది . సుమారు 50 వేలకు మంది పైగా భక్తులు శ్రీశైలం చేరుకున్నారని అంచనా



పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



పాతాళ గంగలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు






స్వామి అమ్మ వార్ల దర్శనం కోసం క్యూ లైన్ లో వేచి ఉన్న భక్తులు

## జోర్డాన్‌లో డ్రాగన్ యాక్షన్ సీన్స్

టాలీవుడ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్-డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కలయికలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డ్రాగన్' సినిమాపై అభిమానుల్లో రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన ప్రతి చిన్న అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన షూటింగ్ జోర్డాన్‌లో జరుగుతోంది. అక్కడ ఎన్టీఆర్‌పై అత్యంత భారీ యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. ఈ యాక్షన్ ఎపిసోడ్ పూర్తయిన వెంటనే ఓ స్పెషల్ సాంగ్‌ను షూట్ చేయనున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఆ పాటలో ఎన్టీఆర్ స్టెప్స్‌తో పాటు హీరోయిన్ రుక్మిణీ వసంత్ గ్లామర్ ప్రధాన ఆకర్షణగా నిలవనుందని టాక్ వినిపిస్తోంది. ప్రశాంత్ నీల్ స్టైల్‌కు తగ్గట్టుగా ఈ సాంగ్‌ను కూడా గ్రాండ్ లెవల్‌లో తెరకెక్కించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలిచే అవకాశముంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని యూనిట్ చెబుతోంది. ఎన్టీఆర్ కెరీర్‌లోనే ఇది అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా నిలవాలని ప్రశాంత్ నీల్ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాడని సమాచారం. అందుకే స్క్రిప్ట్ దశలోనే ఆయన చాలా సమయం కేటాయించాడట. కథ, స్క్రీన్‌ప్లే, యాక్షన్ బ్లాక్స్ అన్నింటినీ అత్యంత జాగ్రత్తగా ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ మరియు ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఆయన సంగీతం ఇప్పటికే ప్రశాంత్ నీల్ సినిమాలకు భారీ ప్లస్ పాయింట్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్ కపూర్ కీలక పాత్రలో కనిపించనుండటం మరో ప్రత్యేకత. భారీ అంచనాల మధ్య రూపొందుతున్న 'డ్రాగన్' సినిమాను ఈ ఏడాది జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది.





## విశ్వంభరకు ప్రత్యేకంగా టైటిల్ కార్డ్స్



మెగాస్టార్ చిరంజీవి, వశిష్ట కాంబినేషన్‌లో రాబోతున్న సోషియో-ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' సినిమాపై టాలీవుడ్‌లో భారీ అంచనాలు ఉన్న విషయం తెలిసిందే. అయితే ఈ సినిమా టైటిల్ కార్డ్స్ విషయంలో దర్శకుడు వశిష్ట తీసుకున్న నిర్ణయం ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. లోకేష్ కనగరాజ్ దర్శకత్వం వహించిన 'లియో' సినిమా తర్వాత యానిమేటెడ్ టైటిల్ కార్డ్స్ వేయడం అనేది ఒక ట్రెండ్‌గా మారిపోయిందన్న సంగతి తెలిసిందే, అయితే తన సినిమా కోసం ఆ రొటీన్ ఫార్ములాను ఫాలో అవ్వడం తమకు ఇష్టం లేదని వశిష్ట క్లారిటీ ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ ట్రెండ్‌ను బ్రేక్ చేస్తూ 'విశ్వంభర' కాన్సెప్ట్‌ను ప్రతిబింబించేలా ఏకంగా ఎనిమిది రకాల ప్రత్యేకమైన మెగాస్టార్ టైటిల్ కార్డ్ డిజైన్స్‌ను చిత్ర బృందం రూపొందించినట్లు తెలుస్తుంది. పంచభూతాల నేపథ్యంలో సాగే ఈ ఫాంటసీ అడ్వెంచర్‌లో ప్రతి టైటిల్ కార్డ్ ఒక ప్రత్యేకమైన ఎలిమెంట్‌ను ప్రేక్షకులకు పరిచయం చేయబోతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో, చిరంజీవి ఇమేజ్‌ను మరో లెవల్‌లో చూపిస్తూ ఈ కార్డ్స్ డిజైన్ చేయబడ్డాయి. కేవలం టైటిల్ కార్డ్స్ కోసమే దర్శకుడు ఇంతటి కసరత్తు చేశారంటే, వెండితెరపై సినిమా ఏ స్థాయి విజువల్ వండర్‌గా ఉండబోతుం దోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సంక్రాంతి కానుకగా విడుదల కానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త సంచలనాలు సృష్టించడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## బాలీవుడ్‌లోకి కిరణ్ అబ్బవరం



టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం తన కెరీర్‌లో మరో భారీ అడుగు వేయబోతున్నారు. 'క' చిత్రంతో పాన్-ఇండియా స్థాయిలో తన సత్తా చాటిన కిరణ్, ఇప్పుడు బాలీవుడ్ ప్రముఖ నిర్మాత ప్రేరణ అరోరా నిర్మాణంలో ఒక భారీ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు తెలుస్తుంది. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని జీ స్టూడియోస్ అధినేత ఉమేష్ బన్సాల్‌తో కలిసి ప్రేరణ అరోరా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించనుండగా, కీర్తన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారతీయ సంస్కృతి మరియు పురాణాల నేపథ్యంలో సాగే ఒక అద్భుతమైన మైథాలజీ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌గా ఈ చిత్రం తెరకెక్కనుంది. ఈ సినిమా కోసం మేకర్స్ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించబోతున్నారు. గ్రాండ్ విజువల్స్ మరియు హై టెక్నికల్ వాల్యూస్‌తో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ చిత్రం రూపొందనుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతుండగా, అన్ని కార్యక్రమాలు పూర్తి చేసి సెప్టెంబర్ నెల నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించాలని చిత్ర బృందం నిర్ణయించినట్లు సమాచారం. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం బాలీవుడ్ లేదా టాలీవుడ్‌కు చెందిన ఒక అగ్ర నటిని హీరోయిన్‌గా ఎంపిక చేసే ప్రక్రియలో చిత్ర యూనిట్ ఉంది.

భక్తి, భావోద్వేగాలు, డ్రామా మరియు హై-వోల్టేజ్ యాక్షన్ సీక్వెన్స్‌ల కలయికతో ఈ కథ ఉండబోతోందని, ప్రేక్షకులకు ఇది ఒక సరికొత్త దృశ్యకావ్యాన్ని అందిస్తుందని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. సినిమా టైటిల్, దర్శకుడు మరియు ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను మేకర్స్ త్వరలోనే అధికారికంగా వెల్లడించనున్నారు. 'క' సినిమా విజయంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కిరణ్ అబ్బవరం, ఈ గ్లోబల్ ప్రాజెక్ట్‌తో బాక్సాఫీస్ వద్ద తనదైన ముద్ర వేయాలని సిద్ధమవుతున్నారు.

## కొచ్చాడైయాన్ నిర్మాతకు మద్రాస్ హైకోర్టు నోటీసులు

### యాడ్ బ్యూరోకు రెండున్నర కోట్లు చెల్లించాలని ఆదేశం



చెక్ బౌన్స్ కేసులో 'కొచ్చడైయాన్' సినిమా (తెలుగులో 'విక్రమసింహ') నిర్మాతకు మద్రాసు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. యాడ్ బ్యూరో సంస్థకు నాలుగు వారాల్లో రూ.2.5కోట్లు చెల్లించాలని లేదంటే ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించింది. రజనీకాంత్ కథానాయకుడిగా ఆయన కుమార్తె సౌందర్య దర్శకత్వంలో 2014లో వచ్చిన 3డీ మోషన్ క్యాప్చర్ మూవీ 'కొచ్చడైయాన్'. దీపిక పదుకొణె కథానాయిక. ఈ సినిమా నిర్మాణ పనులకు బెంగళూరుకి చెందిన యాడ్ బ్యూరో అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి మీడియా వన్ గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ లిమిటెడ్ డైరెక్టర్లలో ఒకరైన మురళీమనోహర్ రుణం తీసుకున్నారు. తిరిగి చెల్లింపుల్లో భాగంగా 2014లో మురళీమనోహర్ యాడ్ బ్యూరో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అబిర్ చంద్ నహర్‌కు రూ.5 కోట్ల చెక్ ఇచ్చారు. అది బౌన్స్ కావడంతో ఆయన కోర్టును ఆశ్రయించారు. మొదట ఈ కేసులో మురళీ మనోహర్‌కు ట్రయిల్ కోర్టు ఆరు నెలలు జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సవాలు చేస్తూ ఆయన మద్రాసు హైకోర్టును ఆశ్రయించారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఇచ్చిన గడువులోపు యాడ్ బ్యూరో అడ్వంల్గ÷జింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు రూ.2.5 కోట్లు చెల్లించాలని లేదంటే జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని ఆదేశించింది.

## రాజమౌళి సినిమాలంటే ఇష్టం.. నిక్



ఎస్.ఎస్ రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ బాబు హీరోగా నటిస్తోన్న చిత్రం 'వారణాసి'లో ప్రియాంక చోప్రా.. మందాకిని అనే ప్రధాన పాత్రలో కనిపించనున్న విషయం తెలిసిందే. ప్రియాంక ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై ఆమె భర్త నిక్ జోనస్ మొదటిసారి స్పందించారు. ఈ సినిమా గురించి ఓ హాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రస్తావించారు. తను 14 నెలల నుంచి ఓ సినిమా షూటింగ్‌లో బిజీగా ఉంది. 'ఆర్ఆర్ఆర్' లాంటి గొప్ప చిత్రాన్ని రూపొందించిన రాజమౌళి దీన్ని రూపొందిస్తున్నారు. ఆయన నుంచి వస్తోన్న మరో భారీ చిత్రమిది. అద్భుతంగా ఉండనుందని నమ్ముతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిక్ భారతీయ చిత్రాల గురించి మాట్లాడారు. తనకు ఇండియన్ సినిమాలు అంటే ఎంతో ఇష్టమన్నారు. గొప్ప చిత్రాలు ఉన్నాయని కొనియాడారు. భారతీయ సంగీతమన్నా అభిమానమన్నారు. భారత్‌లో ఉమ్మడి కుటుంబవ్యవస్థ ఉందని అది తనకు చాలా ఇష్టమన్నారు. ఏదైనా వేడుక జరిగినప్పుడు అందరూ కలిసి సరదాగా ఉంటారని తెలిపారు. 'వారణాసి' విషయానికొస్తే.. ప్రస్తుతం దీని షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రతినాయకుడిగా నటిస్తున్నారు. ఈ మూవీ 2027 ఏప్రిల్ 7న విడుదల కానుంది.

Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu… EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.